ప్రజాశక్తి
శనివారం 3 ఆగస్టు 2024 | 8 పేజీలు | ఎన్‌టిఆర్ | కృష్ణా

చెల్లింపుల్లో చిక్కులు

- పేరుకుపోతున్న నీటి తీరువా బకాయిలు
- కృష్ణాలో డిమాండ్ రూ.32.53 కోట్లు పైనే
- వసూలైంది రూ.5.84 కోట్లు మాత్రమే
- జాప్యంతో రైతులకు వడ్డీ భారం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

గత ప్రభుత్వం నీటి తీరువా వసూళ్ల విధానంలో తీసుకు వచ్చిన మార్పులు రైతులకు గుదిబండగా మారుతున్నాయి. విఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది వసూలు చేసే శిస్తును వైసిపి ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలోకి మార్చడం సమస్యగా మారింది. నీటి తీరువా బకాయిలు పేరుకుపోతున్నాయి. మరోపక్క బకాయిలపై రైతులకు వడ్డీ భారం పడుతోంది. ఈ శిస్తు సకాలంలో వసూలు కాలేదనే కారణంతో కాలువలు, డ్రైన్ల సాధారణ నిర్వహణను ప్రభుత్వాలు తీవ్ర జాప్యం చేయడం సమస్యగా మారుతోంది.

వివిధ పంటలకు, ఆక్వా చెరువులకు నీటిని సరఫరా చేసినందుకు నీటి తీరువా శిస్తును ప్రభుత్వాలు వసూలు చేస్తున్నాయి. పంటను అనుసరించి ఎకరాకు రూ. 200 నుంచి 350 వరకు చెల్లించాలి. 1432 ఫసలీకి సంబంధించి జిల్లాలో 3,97,754 ఖాతాదారులు రూ. 32.53 కోట్ల వరకు చెల్లించాలి. కేవలం రూ. 5.84 కోట్ల వరకు మాత్రమే వసూలైంది. రూ.26.68 కోట్ల వరకు బకాయి పేరుకుపోయింది.

డివిజన్ పేరు	ఖాతాల సంఖ్య	డిమాండ్	వసూలైంది
మచిలీపట్నం	1,76,754	రూ.16,04,03,626	రూ.2,25,66,269
గుడివాడ	1,23,776	రూ.10,90,19,823	రూ.2,78,63,162
ఉయ్యూరు	97,227	రూ.5,58,77,009	రూ.79,75,434
మొత్తం	**3,97,754**	**రూ.32,53,00,459**	**రూ.5,84,04,886**

చెల్లింపుల్లో సమస్యలు... రైతులకు వడ్డీ భారం

గతంలో పంట నూర్పిళ్లు, విక్రయాలు పూర్తయిన తర్వాత విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్(విఆర్‌వో)లు రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి నీటి తీరువా శిస్తు వసూళ్లు చేసేవారు. నూటికి 90 శాతం మందికిపైగా రైతులు వెంటనే చెల్లించే వారు. అయితే వైసిపి ప్రభుత్వం శిస్తు వసూలును ఆన్‌లైన్ చేసింది. ఆన్‌లైన్ చేసినప్పటి నుంచి సైట్ తప్పుల తడకగా మారింది. గతంలో శిస్తు చెల్లించిన రైతుల ఖాతాల్లో అధిక మొత్తంలో బకాయి చూపడం, కొందరు రైతుల ఖాతాలు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడం వంటి సమస్యలు చోటుచేసుకున్నాయి. దీన్ని సవరించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహించారు. దీంతో శిస్తు బకాయిలు పేరుకు పోయాయి. మరోపక్క వివిధ కారణాలతో శిస్తు చెల్లింపుల్లో జాప్యం జరిగిన రైతులపై వడ్డీ భారం పడుతోంది.

కాలువలు, డ్రయిన్ల నిర్వహణ పనులపై ప్రభావం

డెల్టాలోని కాలువలు, డ్రయిన్ల నిర్వహణకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించడం లేదు ఈ శిస్తు వసూలును ఆధారం చేసుకునే డెల్టాలోని కాలువలు, డ్రయిన్లకు ప్రతి ఏటా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఈ ఏడాది అరకొరగానే శిస్తు వసూళ్లు జరగడంతో కాలువలు, డ్రయిన్ల నిర్వహణను జలవనరులశాఖ పక్కనపెట్టింది. ఈ క్రమంలోనే క్షేత్రస్థాయి పరిస్థితులు అధ్వాన్నంగా ఉండటంతో నూతన ప్రభుత్వం వీటి నిర్వహణకు నిధులు మంజూరు చేసింది. భవిష్యత్‌లో సమస్యలు లేకుండా ఈ శిస్తు వసూళ్ల విధానంలో లోపాలను ప్రభుత్వం పూర్తి స్థాయిలో సవరించాలని రైతులు అంటున్నారు.

మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

సిఆర్‌డిఎ పరిధి పునరుద్ధరణ!

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సిఆర్‌డిఏ పరిధిని తిరిగి పునరుద్ధరిస్తూ ప్రభుత్వం శుక్రవారం నిర్ణయం తీసుకుంది. 2015లో ఇచ్చిన జీవో నెంబర్ 207 ప్రకారం 8,352 చదరపు కిలోమీటర్ల పరిధిలోనే సీఆర్డీయే ఉంటుందని నిర్ణయించారు. ఈమేరకు సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ 36వ అథారిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో పరిధి కుదింపును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో కలిపిన పలు గ్రామాలను మళ్లీ రాజధాని పరిధిలోకి తీసుకురావాల్సి ఉందని అధికారులు వివరించారు. ఈమేరకు 2015లో జారీ చేసిన జివో 207 ప్రకారం ఏయే ప్రాంతాలు సిఆర్‌డిఏలో ఉన్నాయో వీటిని యథాతథంగా కొనసాగించాలని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రెండు ఏళ్ల క్రితం సిఆర్‌డిఏ పరిధిలో ఉన్న పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాలు, సత్తెనపల్లి మండలం, సత్తెనపల్లి మునిసిపాలిటీ, యడ్లపాడు, రాజుపాలెం మండలంను తొలగించి పల్నాడు జిల్లాలోని మొత్తం ఎనిమిది మునిసిపాలిటీలు, 28 మండలాలు కలిపి పల్నాడు డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తూ అప్పటి వైసిపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడు రాజధానుల నినాదం నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం సిఆర్‌డిఏను ముక్కలుగా చేసేందుకు ప్రయత్నించింది. ఇందులో భాగంగా మంగళగిరి కార్పొరేషన్‌ను కూడా సిఆర్‌డిఏ పరిధి నుంచి తప్పించింది. అలాగే బాపట్ల జిల్లా పరిధిలోని వేమూరు, అమృతలూరు మండలాలను కూడా సిఆర్‌డిఏ పరిధి నుంచి తప్పిస్తూ వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజకవర్గాలను కలిపి మొత్తంగా బాపట్ల డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేశారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత రాజధాని అమరావతి అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్న నేపథ్యంలో సిఆర్‌డిఏ పరిధి నుంచి తప్పించిన మండలాలు, మునిసిపాలిటీలను తిరిగి రాజధాని పరిధిలోకి తీసుకువచ్చేలా నిర్ణయం తీసుకుంటున్నామని సిఎం చంద్రబాబు శుక్రవారం జరిగిన సమీక్షలో వెల్లడించారు. అలాగే ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం, నాలుగు లైన్లుగా కరకట్ట రోడ్డు విస్తరణపై ముందుకెళ్లాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ల్యాండ్‌పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు ఇచ్చే (మిగతా 2లో)

పింగళి వెంకయ్యకు నివాళి



పింగళి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంఎల్‌ఏ కుమార్‌రాజా

పింగళి వెంకయ్య 161వ జయంతి సందర్భంగా కృష్ణాజిల్లాలో పలుచోట్ల ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మొవ్వ మండలం భట్లపెనుమర్రులో పామర్రు ఎంఎల్ఏ వర్ల కుమార్‌రాజా, కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ బాలాజీ ,చిలకలపూడిలో ఎస్‌పి గంగాధరరావు నివాళు లర్పించారు.

... వార్తలు లోపలి పేజీల్లో

పంద్రాగస్టుకు శరవేగంగా ఏర్పాట్లు

- త్వరలో ఇందిరాగాంధీ స్టేడియం సిద్ధం
- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.సృజన

స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన, అధికారులు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: రాష్ట్రస్థాయి 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన అధికారులను ఆదేశించారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ పరిశీలించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 15వ తేదీన స్టేడియంలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పాటు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. సుమారు ఆరు వేల మందికి పైగా విద్యార్థులు హాజరు కానున్నారని, వారికి అల్పాహారం, తాగునీరు అందించేలా విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాంగణంలో నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా విద్యుత్ శాఖాధికారులు జనరేటర్లను ఏర్పాటు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అత్యవసర మందులతో ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. వేడుకలను ప్రత్యేక్ష ప్రసారం చేయడంతో పాటు పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేయాలని సమాచార శాఖ అధికారులకు సూచించారు. పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, ఆర్అండ్‌బి, ట్రాన్స్‌కో, ఫైర్, ఏపిఎస్ఆర్‌టిసి, మెడికల్ అండ్ హెల్త్, సివిల్ సప్లయి, తదితర అధికారుల సమన్వయంతో ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. సాధారణ పరిపాలన శాఖ విఐపిలకు, వివిఐపిలకు ప్రోటోకాల్ ప్రకారం కేటాయించిన గ్యాలరీల వారీగా పాస్‌లను మంజూరు చేయాలన్నారు. ఏర్పాట్ల నిర్వహణలో ఎటువంటి సమస్యలు ఎదురైనా తక్షణమే తన దృష్టికి తీసుకురావాలన్నారు. రిహార్సల్స్ నిర్వహించే నాటికి పూర్తిస్థాయి ఏర్పాట్లతో స్టేడియం సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో విఎంసి కమిషనర్ హెచ్‌యం ధ్యానచంద్ర, ఆర్‌డివో భవానిశంకర్, డిసిపిలు గౌతమీశాలి, ఏబిటీఎస్ ఉదయరాణి, కె.చక్రవర్తి, ఎసిపి కె.దామెదరావు, సమాచార శాఖ రీజనల్ ఇంజనీర్ సి.వి.కృష్ణారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి యు.వెంకట సుబ్బారావు, ఆర్అండ్‌బి ఎస్ఇ వి.కె. విజయశ్రీ, డిఆర్‌డిఎ పీడీ కె. శ్రీనివాసరావు, డియంఅండ్‌హెచ్‌వో యం.సుహాసిని, డిఐపిఆర్‌వో యు.సురేంద్రనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సిపిని కలిసిన నూతన ఎసిపిలు

ప్రజాశక్తి-విజయవాడ: నూతన ఎసిపిలుగా బాధ్యతలు స్వీకరించిన దామోదర్, రాజారావు నగర పోలీసు కమిషనర్ ఎస్‌వి రాజశేఖర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. సాధారణ బదిలీల నేపథ్యంలో ఏ.పి.ఎస్.పి. 14వ బెటాలియన్‌లో డి.ఎస్.పి.గా పనిచేస్తున్న కె.దామోదర్‌ను ఎన్.టి.ఆర్. జిల్లా పోలీస్ కమీషనరేట్ సెంట్రల్ సబ్ డివిజన్ ఏ.సి.పి.గా, అదే విధంగా తిరుపతి పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో డి.ఎస్.పి.గా పనిచేస్తున్న ఎం.రాజారావును ఎన్.టి.ఆర్. జిల్లా పోలీస్ కమీషనరేట్‌లోని నార్త్ సబ్ డివిజన్ ఏ.సి.పి.గా బదిలీ చేసిన విషయం తెలిసిందే .ఈ నేపథ్యంలో ఏ.సి.పి.లు కె.దామోదర్, ఎం.రాజారావులు ఎన్.టి.ఆర్. జిల్లా పోలీస్ కమీషనరేట్‌లో బాధ్యతలను స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో నగర పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-విజయవాడ: మరణించిన హోంగార్డులు కోటేశ్వర రావు, మోహనరావుల కుటుంబాలకి ఆర్థిక సహాయంగా ఒకొక్కరికి రూ. 5 లక్షల నగదు చెక్కులను శుక్రవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖరబాబు చేతులమీదుగా కోటేశ్వరరావు భార్య నాగలక్ష్మి , మోహనరావు భార్య ప్రమీలా అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. అడ్మిన్ కష్ణమూర్తి నాయుడు, హోంగార్డు ఆర్.ఐ. కె.సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కార్యాచరణ

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టిఆర్ జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు అవసరమైన అన్ని నివారణ చర్యలు చేపట్టాలని ఇందుకు ప్రధానంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు (బ్లాక్ స్పాట్)లపై సమన్వయ శాఖల అధికారులు దష్టిసారించాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సజన అధ్యక్షతన జిల్లా రహదారి భద్రత కమిటీ (డీఆర్‌ఎస్‌సీ) సమావేశం జరిగింది. పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర బాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, డీసీపీ (లా అండ్ ఆర్డర్) గౌతమి శాలి, డీసీపీ (ట్రాఫిక్) కె.చక్రవర్తి, డిప్యూటీ రవాణా కమిషనర్ ఎం.పురేంద్ర తదితరులు హాజరైన ఈ సమావేశంలో జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, బ్లాక్ స్పాట్‌లు, రహదారి భద్రత ఉల్లంఘనలపై చర్యలు, హిట్ అండ్ రన్ మోటార్ యాక్సిడెంట్ స్కీమ్-2022, ఐ-రాడ్ అమలు, వీఎంసీ సురక్షిత రవాణా ప్రణాళిక, రహదారి ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు తదితరాలపై చర్చించారు. గత సమావేశంలో తీర్మానించిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలను సమీక్షించారు. ట్రాఫిక్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుకల్పించే అస్త్రం (యాక్సనబుల్ ఇంటెలిజెన్స్ ఫర్ సస్టైనబుల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్) యాప్‌పైనా కమిటీలో చర్చించారు.

మొదటిపేజీ తరువాయి

సిఆర్‌డిఎ పరిధి పునరుద్ధరణ !

కౌలును మరో ఐదేళ్ల పొడిగించాలని నిర్ణయించారు. 2015 నుంచి 2024 వరకు చెల్లించిన కౌలును మరో ఐదేళ్ల పాటు రాజధాని రైతులకు చెల్లిస్తారు. గతంలో కోర్ క్యాపిటల్ సిటీ 217 చదరపు కిలోమీటర్ల ఉండేలా మాస్టర్ ప్లాన్ ను రూపొందించారు. ఇదే రీతిలో 54 చదరపు కిలోమీటర్లు గల నాలుగు గ్రామాలను మంగళగిరి మున్సిఫల్ కార్పొరేషన్ లో కలపగా వీటిని కూడా తిరిగి కోర్ క్యాపిటల్ సిటీలో కలుపుతూ మొత్తం 217 చదరపు కిలోమీటర్ల పరిధిగా కోర్ క్యాపిటల్ సిటీని నిర్ణయించినట్లు మునిసిపల్ మంత్రి పి.నారాయణ మీడియాకు తెలిపారు. గతంలో టిడిపి ప్రభుత్వం సెంట్రల్ డివైడర్తో నాలుగు లేన్ల కరకట్ట రోడ్ నిర్మాణాన్ని ప్రతిపాదిస్తే, గత ప్రభుత్వం ఆ రోడ్డును రెండు లేన్లకు కుదించిందన్నారు. గతంలో నిర్ణయించినట్లుగానే కరకట్ట రోడ్డును నాలుగు లేన్ల నిర్మాణాన్ని త్వరలోనే చేపట్టేందుకు టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు తెలిపారు. క్యాపిటల్ సిటీ ఎంత వరకు ఉంటే, అంత వరకు కరకట్ట రోడ్ నిర్మాణం ఉంటుందన్నారు. 217 చదరపు కిలోమీటర్ల కోర్ క్యాపిటల్ సిటీలో తూర్పు నుండి పడమరకి ఒక రహదారి గ్రిడ్ ను ఏర్పాటు చేసి దాన్ని జాతీయ రహదారికి అనుసంధానం చేసేలా నిర్ణయించడం జరిగిందన్నారు. కృష్ణా నదిపై ఆరు ఐకాన్ బ్రిడ్జిలు వస్తున్నాయని తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: పుట్టిన నాటి నుండి తల్లి పాలు ఇవ్వడం బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం అని చనుబాలుకు అవసరమైన ఔషదం మరోకటి లేదని తల్లిపాలుపై అవగాహన కల్పించేందుకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రైవేట్ ప్లేస్కూల్స్‌కి ధీటుగా మౌలిక వసతులు కల్పించి ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను అంగన్‌వాడీలో చేర్చేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం గుణదల క్రీస్తురాజుపురంలోని అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి చిన్నారులతో ముచ్చటించిన అనంతరం గర్భిణీస్త్రీలకు సీమంతాలు నిర్వహించి పోష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుట్టిన నాటి నుండే బిడ్డకు తల్లి చనుబాలును తప్పక అందించాలన్నారు. తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని రోగనిరోధక శక్తి అధికంగా ఉండే తల్లి పాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమన్నారు. తల్లిపాలపై అవగాహన కల్పించేందుకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. నేటి సమాజంలో మహిళలు సౌందర్యం తగ్గుతుందనే అపోహతో పాటు బిడ్డలకు చనుబాలు ఇవ్వకుండా పోతపాలను పడుతున్నారన్నారు. పోతపాలు బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదన్నారు. తల్లిపాలలో ఉండే పోషకాలు తల్లి బిడ్డ ఎదుగుదలపై ప్రభావం చూపుతుందన్నారు. తల్లిపాలు మాత్రమే నవజాత శిశువులకు అయోడిన్ పొందేందుకు ఏకైక మార్గమన్నారు. పుట్టిన బిడ్డకు మొదటి వెయ్యి రోజులు కీలకమని శిశువుల మెదడు మరియు శారీరక అవయవాల అభివృద్ధికి అయోడిన్ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. శిశు మరణాలు, మెంటల్ రిటార్డేషన్, కుంగిపోయిన ఎదుగుదల ఎండిమిక్ గాయిటర్ హైపోథైరాయిడిజం మొదలైన వాటి ప్రమాదం నుండి తల్లిపాల ద్వారా మాత్రమే రక్షణ కల్పిస్తుందన్నారు. జిల్లాలో 1475 అంగన్‌వాడీల ద్వారా 10,251 మంది గర్భిణీలకు, 7,125 బాలింతలతో పాటు 7 నెలల నుండి 3 సంవత్సరాల వయస్సు గల 50,633 మంది చిన్నారులకు, 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు కలిగిన 48,009 చిన్నారులకు సంపూర్ణ పోష్టికాహారంతో పాటు ఆటపాటలు విద్యాబుద్దులు నేర్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ శిశుసంక్షేమ అధికారిణి జి.ఉమాదేవి, సిడిపివో జి.మంగమ్మ, సూపర్‌వైజర్ రెహన, పిన్నమనేని సిద్ధార్థ వైద్యాశాల మెడికల్ ఆఫీసర్ డా. పద్మజా చౌదరి పాల్గొన్నారు.

బాలికకు ప్రిన్సిపల్ వేధింపులు

ప్రజాశక్తి-భవానీపురం: భవానీపురం శివాలయం సెంటర్లో ఉన్న రవీంద్ర భారతి స్కూల్‌లో ఓ బాలిక పట్ల ప్రిన్సిపల్ లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు... పాఠశాలకు చెందిన ప్రిన్సిపల్ అన్నదాసు శ్రీనివాసరావు స్కూల్లో బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులతో పాటు మరికొంతమంది పాఠశాలకు చేరుకుని ప్రిన్సిపల్‌ను నిలదీశారు. విషయం తెలుసుకున్న భవానీపురం సిఐ ఉమామహేశ్వరరావు పాఠశాలకు చేరుకుని వివరాలు సేకరించారు. ప్రిన్సిపల్‌పై ఫోక్సు యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పతకాలు వచ్చేలా శిక్షణ ఇవ్వండి : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: ఒలంపిక్స్ లో విజయాలు సాధించేలా కోచింగ్ ఇవ్వాలని, క్రీడాకారులకు సకల సౌకర్యాలు విజయవాడ నగరపాలక సంస్థ ఎల్లప్పుడూ కల్పిస్తుందని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం ఎంజీ రోడ్ లోని డి ఆర్ ఆర్ ఇండోర్ స్టేడియం క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్ అక్కడున్న కోచ్‌తో మాట్లాడారు. దండమూడి రాజగోపాల్ రావు స్టేడియంలో క్రీడాకారులకు క్రీడా నైపుణ్యం పెంచే వసతులుండాలన్నారు. స్టేడియంలో అవసరమయ్యే మరమతులన్నీ, త్వరతిగతిన పూర్తి చేసి క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, నాణ్యతమైన కోచింగ్ ఇచ్చి ఒలంపిక్స్‌లో విజయాలు సాధించే విధంగా వాళ్లలో ప్రేరణ పెంచాలని అన్నారు. దానికి అవసరమయ్యే వసతులు విజయవాడ నగరపాలక సంస్థ కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌ఓ,

డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ ఇంచార్జ్ డి.మాల్యాద్రి, ఎస్‌ఎఫ్‌ఓ యం.రాజా, బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రివర్ ఫ్రంట్ పార్కును అందుబాటులోకి తేవాలి

ప్రజాశక్తి-విజయవాడ: కృష్ణలంక రిటైనింగ్ వాల్ వెంబడి నిర్మించాల్సిన డ్రెయినేజీ పనులను త్వరగా ప్రారంభించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాణిగారితోట పర్యటనలో భాగంగా రిటైనింగ్ వాల్ వెంబడి డ్రెయినేజీ లేక ఇబ్బంది పడుతున్న స్థానిక ప్రజల నుంచి వెలువడుతున్న సమాచారం ఆధారంగా, కమిషనర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సత్వరమే డ్రెయినేజి నిర్మాణ పనులను ప్రారంభించాలని, వీలయింత త్వరగా పూర్తి చేసేటట్లు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. రాణిగారితోట పరిధిలోని కృష్ణారిటైనింగ్ వాల్ వెంబడి ఏర్పాటు చేసిన కనకదుర్గ వారధి సమీప రివర్ ఫ్రెంట్ పార్కులో ఫెన్సింగ్ పనులను పూర్తి చేసి త్వరలో పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రివర్ ఫ్రంట్ పార్క్ ప్రారంభం నుండి చివరి వరకు నడుస్తూ పార్క్ లో అధికారులు తీసుకోవాల్సిన చర్యల పట్ల అధికారులకు సూచనలు చేశారు. అనంతరం రామలింగేశ్వర నగర్ ఎస్టిపి ప్లాంట్‌ను పరిశీలించిన కమిషనర్, వాటర్ ట్రీట్మెంట్ లో జరుగుతున్న ప్రాసెస్‌ని పరిశీలించారు. అప్గ్రేడేషన్ లో పూర్తి కావాల్సిన పనులన్నీ త్వరగా పూర్తిచేసి, వాటర్ ట్రీట్మెంట్ ను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్ కే వి సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం ప్రభాకర్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వెంకటేశ్వర రెడ్డి, జి సామ్రాజ్యం పాల్గొన్నారు.

IN THE COURT OF THE II JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT :: HYDERABAD

O.S. No. 1231 of 2024

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager (Law) &Authorized Officer,
...Plaintiff
And
Sri.K.Srinivas
...Defendant

To
Sri.K.Srinivas, S/o.Chandra Shekar Rao, Aged about 53 years, Occ: Business, R/o.D.No.31-8-13/1, Pala Booth St, Maruthi Nagar, Vijayawada, A.P-520004.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs2.84.203-36ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 08-08-2024.

In case of your failure to attend before the Court on 08-08-2024 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)

T. Bhagya Raju & Associate
Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,

లింకు దస్తావేజులు పోయినవి

యన్‌టిఆర్ జిల్లా, కొండపల్లి మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నం గ్రామ కాపురస్తులు 1)కన్నెధార అమరలింగం, తండ్రి : నరసయ్య, 2) ఆలేటి మురళి తండ్రి: పున్నయ్య అను మాకు ఇబ్రహీంపట్నం గ్రామ రీ. సర్వే నెం. 17/ఎరు దాఖలా చ.గ. 489లు ఆస్తిని పులిగడ్డ దేవకీనందన గారు వగైరాల నుండి క్రయం పొంది ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం.1910/2000గా విక్రయ దస్తావేజు రిజిష్టర్ చేయించుకున్నాము. సదరు డాక్యుమెంటుకు సంబంధించిన ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు ఆఫీసు వారి లింకు డాక్యుమెంటు 8-2-1990 దస్తావేజు నెం. 65/1990 ను ది.24-7-2024న ఇబ్రహీంపట్నం గ్రామంలో ఫొటోస్టాట్ నిమిత్తం వెళ్ళగా మార్గమధ్యంలో జారిపోయినది. మేము ఎంత వెదికినా దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రస్‌నకు తెలియజేయగలరు.

ఇట్లు
కె.అమర లింగం,
ఎ.మురళి

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గారి కోర్టులో

IA NO.50/2024 IN O.S NO. 9/2024

యేరువ శ్రీనివాసరెడ్డి ... వాది/పిటీషనర్
Vs
కొండపల్లి శ్రీనివాసరావు ...ప్రతివాది/రెస్పాండెంట్

To:
కొండపల్లి శ్రీనివాసరావు, S/o కృష్ణమూర్తి
నివాసము ప్లాట్ నెం. TF-3, K.K.R. Towers, OK Classing Homes, పాలబజారు వెనుక, BMPS రోడ్డు, పాత ఎలిమెంటరీ స్కూల్ రోడ్డు, విజయవాడ టౌన్ & మండలం, యన్.టి.ఆర్ జిల్లా.
సెల్. 9010133306

పై నెంబరు దావాలో, మీరు ప్రతివాది అయి ఉన్నారు. కావున మీకు పలుమార్లు దావా సమన్లు పంపగా, మీకు ముట్టనందున, శ్రీకోర్టువారు మీకు ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు నిమిత్తమై ఉత్తర్వులు జారీ చేసినందున **ది.30-08-2024** వ తేదీ ఉ॥ 10-30 ని॥ లకు, మీరు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని లేదా వకీలు ద్వారాగాని హాజరై మీకు అక్షేపణలు ఉన్న యెడల తెలుపు కోవలసినది. లేనియెడల, మీ పరోక్షమందు, చట్ట ప్రకారము తీర్మానము చేయబడు నని ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలియజేయడమైనది.
వాయిదా తేది. 30-08-2024
శ్రీ కోర్టు వారి అనుమతితో....

డి. బుజ్జిబాబు
సెల్. 9515204071
వాది తరుపు అడ్వకేట్,
నరసరావుపేట.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



మోపిదేవి మండలంలో...

ప్రజాశక్తి-ఉయ్యూరు : ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో పురస్కరించుకొని ఉయ్యూరు మండలం బోళ్ళపాడు గ్రామంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యతపై కొద్దిసేపు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ ఆరోగ్య కార్యదర్శి రోహిణి లక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డల ఆరోగ్యానికి బాటలు వేస్తుందన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించడం ద్వారా శిశువులో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలలో అద్భుతమైన పోషకాలు ఉంటాయని వీటి ద్వారా బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తారన్నారు. ప్రపంచంలోనే కల్తీ లేని ఏకైక వస్తువు తల్లిపాలు మాత్రమేనని వివరించారు. ప్రతి ఒక్క కుటుంబంలోనూ తల్లిపాల పట్ల అవగాహన పెంపొందించుకొని బిడ్డలకు శిశువులకు తల్లిపాలను తప్పక అందించాలని కోరారు. తల్లిబిడ్డల ఆరోగ్య భద్రతకు తల్లిపాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీ ప్రశాంతి, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి సుధ కీర్తి, వెల్ నెస్ సెంటర్ సిహెచ్ఓ శివకష్ణ, అంగన్వాడీ కార్యకర్త ఇందిరా, గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గన్నవరం : వీరవల్లి ఆర్‌పిహెచ్ కాలనీ అంగన్వాడీ 6వ సెంటర్‌లో తల్లిపాల వారోత్స వాల అవగహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏఎన్ఎం సిహెచ్ కమలకుమారి తల్లి పాలు ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సి హెచ్ కమలకుమారి, అంగన్వాడీ వర్కర్ హేమలత , ఆశా వర్కర్ రజినీ,సమాధానం, విజయకుమాథి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి పెడన :** ప్రసవానంతరం తల్లులు ముర్రిపాలును చిన్నారులకు ఇవ్వాలని, వాటి ద్వారా ఆయుష్ పెరుగుతుందని అంగన్వాడి కార్యకర్త చందన గీత పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో గర్భిణీలకు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు శ్రేష్టకరమన్నారు. అంతకుముందు గ్రామంలోని పురవీధుల్లో గ్రామస్థులతో కలిసి ఇంటింటికి వెళ్లి తల్లిపాల వలన పిల్లలకు కలిగే ఉపయోగాలను వివరించారు. **ప్రజాశక్తి పెదపారుపూడి :** మండలంలోని వానపాముల గ్రామంలోని అంగన్వాడి కేంద్రాలలో తల్లిపాల వారోత్సాలు జరిగాయి. ఈ సందర్భంగా సూపర్వైజర్ ఎం శివనాగమణి మాట్లా డారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, హెల్త్ సిబ్బంది, తల్లులు, అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** మండల పరిధిలోనివెలివోలు అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ సిహెచ్ ఆదిలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు కుంపటి విజయ కుమారి ఎం వెంకటలక్ష్మి, సహాయ కార్యకర్తల కుంపటి దీప్తి, వి నాగలక్ష్మితల్లులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** మోపిదేవి మండలం మెరకనపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తల్లి పాల ద్వారా బిడ్డకు లభించే ప్రయోజనాల గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. హెల్త్ ఆఫీసర్. షరోన్, హెల్త్ ఆఫీసర్ .బేబి అంజలి. సంపూర్ణ, ఆశా వర్కర్ రాణి,అంగన్వాడీ టీచర్.సుజాత, అంగన్వాడీ హెల్పర్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** మండంలంలోని మేడూరు అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ ఉషా, అంగన్వాడీ టీచర్లు స్థానిక ఏఎన్ఎం కష్ణవేణి, ఆశ వర్కర్లు తల్లులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** మండలంలోని దేవరపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రం 1లో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అంగన్వాడి వర్కర్ పీకే డివి లక్ష్మి, తిరుపతమ్మ, ఏఎన్ఎం లావణ్య, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తట్టుకోలేక కలెక్షన్ ఏజెంట్ మృతి

ప్రకాష్ (ఫైల్)

ప్రజాశక్తి-కంకిపాడు : బ్యాంకు కలెక్షన్ ఏజెంటుగా పనిచేస్తున్న యువకుడు బ్యాంకు మేనేజర్ల ఒత్తిడి తట్టుకోలేక పురుగుమందు తాగి మృతిచెందిన సంఘటన కంకిపాడు మండలం ప్రొద్దుటూరులో గురువారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుడే అఖిల్‌పవన్ ప్రకాష్(33) గుడివాడలోని ఓ ప్రైవేటు బ్యాంకులో కలెక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. అయితే ప్రకాశ్ రికవరీ డబ్బులు సరిగా కట్టడంలేదని బ్యాంకు మేనేజర్లు పామర్తి కష్ణ, వీరంకి వంశీ కుమార్‌లు వేధింపులకు గురిచేస్తున్నారని ఈనెల ఒకటో తేదీన రాత్రి ప్రొద్దుటూరు గ్రామంలోని గాయత్రి విహారకు అనుకుని ఉన్న శ్మశానం వద్ద కలుపు మందు తాగి తన చావుకు కారణం పైవారేనని సెల్ఫ్ వీడియో తీసి తన స్నేహితులకు పంపించాడు. వెంటనే స్నేహితులు, బంధువులు సంఘటనా స్థలం వద్దకు వెళ్లి చూడగా అతను స్పృహ తప్పి పడిపోయి ఉన్నాడు. వెంటనే విజయవాడ గవర్నమెంట్ హాస్పిటల్కు తీసుకొని వెళ్ళగా అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం అను హాస్పటల్‌కు తీసుకెళ్లగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందారు. అఖిల్ పవన్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలియజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి గుడే జయప్రకాష్ పెనమలూరు నియోజకవర్గం నుంచి 2014లో బహుజన్ సమాజ్వాది పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు.

గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలోని గ్రామాల అభివద్ధికి రూ. 20 కోట్ల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు మంజూరైనట్లు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. నిధుల సద్వినియోగంపై ఆర్.డబ్ల్యూ.యస్ మరియు పంచాయతీరాజ్ అధికారులతో యార్లగడ్డ వెంకట్రావు శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో సమావేశం అయ్యారు. ప్రాధాన్యతల వారీగా విజయవాడ రూరల్, గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల పరిధిలోని గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీల అభివద్ధికి పూర్తి స్థాయిలో అంచనాలు రూపొందించాలని, అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ముంపు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థను అభివద్ధి చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పంచాయితీ రాజ్ డీఈ, ఆర్.డబ్ల్యూ.ఎస్ డీఈ లు, నాలుగు మండలాల యమ్.పి.డి.ఓ లు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్ఏ వెంకట్రావు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-కోడూరు : పచ్చని మొక్కలు పెంచడం తోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని కోడూరు ఎస్సై పి.శిరీష అన్నారు. ఉల్లిపాలెం మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు నాగభూషణం చేపట్టిన రోజుకి ఒక మొక్క నాటడం కార్యక్రమంలో శుక్రవారం కోడూరు ఎస్సై పాల్గొని కోడూరు అవనిగడ్డ ప్రధాన రహదారి వెంబడి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి- చల్లపల్లి :** ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడంలో విద్యార్థులు పాత్ర ముఖ్యమైనదని, విద్యార్థి దశ నుండే మొక్కలు నాటకం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు చల్లపల్లి సర్పంచ్ పైడిపాలకష్ణకుమారి సూచించారు. మండల పరిధిలోని పంచాయతీ లక్ష్మీపురం శివారు రామానగరంలోని శ్రీ చైతన్య స్కూల్ నందు స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్ లో మంత్లీ తీమ్ గ్రీన్ ఇండియా మిషన్ పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్పంచ్ పైడిపాముల కృష్ణ కుమారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇంటి పెరట్లో మొక్కలు నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో చల్లపల్లి సర్పంచ్ పైడి పాముల కష్ణకుమారి, ప్రిన్సిపల్ డి సురేష్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం మద్దినేని మురళీకష్ణ, రీజినల్ ఇంచార్జ్. రాజేష్ బాబు డీన్ రమ్య, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో క్లీన్ అండ్ గ్రీన్

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు కళాశాల ఆవరణలో జంగిల్ క్లియరెన్స్ నిర్వహించి పిచ్చి మొక్కలు ముళ్ళ కంపలను తొలగించి పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి రేఖరాణి, వైస్ ప్రిన్సిపాల్ నరసింహారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భాగ్యరాజ్‌కు సత్కారం

ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ కి చెందిన యునైటెడ్ ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ సేవా సంస్థ అధ్యక్షులు బొల్లెద్దు భాగ్యరాజు ని కష్ణాజిల్లా షఉటింగ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో సంఘ కార్యదర్శి విజయ్ కుమార్ సంఘ సభ్యులతో కలిసి ఘనంగా పుష్పగుచ్ఛమిచ్చి శాలువా కప్పి సత్కరించారు. కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ బొల్లెద్దు భాగ్యరాజు కరోనా వంటి ఆపద సమయంలో నిరుపేదలకు అన్నం పెట్టే కార్యక్రమాన్ని మిత్రులు,శిష్య బందం సహాయంతో నిర్వహించడం పట్ల ఆయన ఎంతోమంది ప్రముఖుల మన్ననలను పొందారని అన్నారు. సెంటాన్స్ సీబీఎస్ఈ ప్రిన్సిపల్ అరుణ మేరీ, ఎన్టీఆర్ జిల్లా షఉటింగ్ బాల్ సంఘ కోశాధికారి నసీమా, ఉపాధ్యక్షులు పోకతోట శివకష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకట్రావు, స్వామి, కవిత, శివ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.23 కోట్ల నిధులు మంజూరు : వెనిగండ్ల

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి రూ.23 కోట్లు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. నిధుల సద్వినియోగంపై ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులతో ఎమ్మెల్యే రాము శుక్రవారం ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలోని ప్రజావేదికలో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రాధాన్యత వారీగా గుడివాడ రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల పరిధిలోని గ్రామాల్లో సిసి రోడ్లు, సిసి డ్రైనేజీల అభివద్ధికి పూర్తిస్థాయిలో అంచనాలు రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా ముంపు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థను అభివద్ధి చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విలేకర్లుతో మాట్లా డుతూ సమస్యల తీవ్రత ఉన్న గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు వినియోగిస్తామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, గుడివాడ రూరల్, నందివాడ మండల పార్టీ అధ్యక్షులు వాసే మురళి, దానేటి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

పెన్షనర్ల సొమ్ము స్వాహా

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరంలో ఒకటవ సచివాలయ పరిధిలో 14 మంది పెన్షన్ల సొమ్ము 56 వేల రూపాయలను ఉద్యోగి మాయం చేసిన వైనం వెలుగులోకి వచ్చింది. గన్నవరం ఒకటవ సచివాలయ పరిధిలో అగ్రికల్చర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న కె. రోశయ్యకు పెన్షన్ల పంపిణీ బాధ్యతను అప్పగించారు. అతను పెన్షన్ దారులకు డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోయాడు. ఈ విషయం అధికారులకు తెలిసి వాకబు చేయగా 14 మందికి పింఛన్లు ఇవ్వలేదని తెలిసింది. గన్నవరం ఈవో అనిల్ అతన్ని ఫోన్లో సంప్రదించగా 56 వేల రూపాయలు పోయినట్లుగా చెప్పాడు. దీంతో కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పింఛన్ సొమ్ము అందకపోవడంతో అవ్వ,తాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో సత్య కుమార్ పెన్షన్ సొమ్మును అడ్జస్ట్ చేశారు. 14 మందికి వెంటనే పంపిణీ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. రోశయ్య నుంచి సొమ్ము రికవరీ చేయడంతో పాటు శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

ప్రజాశక్తి-గన్నవరం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనలతోపాటు నాణ్యమైన ఆహారం అందించాలని గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం విజయవాడ రూరల్ మండలంలోని ఎనికేపాడు గ్రామంలో గల ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు, నాణ్యమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి తగు సూచనలు సలహాలు అందజేశారు. పాఠశాలలో అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు కావలసిన నిధులు విడుదల చేసి విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీరు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

దుర్గా బ్యాంక్ డిపాజిటర్లకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కోటేశ్వరరావు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్‌లో డిపాజిట్లు చేసిన వారికి, బ్యాంకులో లోను తీసుకున్నవారికి తగిన న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ జి.సృజనకు సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు శుక్రవారం ఒక వినతిపత్రం సమర్పించారు. డిపాజిట్స్ కాలపరిమితి ముగిసినప్పటికీ 29.7.22 నుండి ఆర్‌బిఐ వారి డైరెక్షన్ మేరకు వారికి డబ్బులు చెల్లించకపోవడంతో డిపాజిట్ దారులు వారి పిల్లల వివాహాలు, చదువులకు ఉపయోగపడకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అందరికీ చెల్లించవలసినది సుమారు రూ.57 కోట్ల 45 లక్షలని, దుర్గా కో-ఆపరేటివ్ బ్యాంక్ వారు ఈ బ్యాంకుకు సంబంధించిన డబ్బులు ఇతర బ్యాంకుల్లో సుమారు రూ.64 కోట్ల 92 లక్షలు డిపాజిట్ చేసినట్లుగా తెలుస్తుందని, సదరు మొత్తం విత్ డ్రా చేసి దుర్గా కోపరేటివ్ బ్యాంకులో డిపాజిట్ చేసుకున్న డిపాజిట్‌దారులకు చెల్లించవచ్చని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు పాల్గొన్నారు.

సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు అక్షర (సాయి) డిగ్రీ కళాశాలలో సిపిఆర్ పై విద్యార్థులు తోటి విద్యార్థులు శుక్రవారం అవగాహన కల్పించారు. గుండె పనితీరు అకస్మాత్తుగా ఆగిపోయే టప్పుడు, ఆగిపోయిన వారికి వెంటనే పంప్ చేసేందుకు దోహదపడే దాన్ని సిపిఆర్ అంటారని చెప్పారు. ప్రస్తుత రోజుల్లో వయసుతో సంబంధం లేకుండా గుండె పోటుతో చిన్న పెద్ద తేడా లేకుండా ఎందరో నిండు ప్రాణాలను కోల్పోతున్న కారణంగా సిపిఆర్ చేస్తే మనిషి ప్రాణాలను మనం 60 నుంచి 80 శాతం కాపాడవచ్చనే విషయాలను బిఎస్సీ విద్యార్థులు కర్రీ నిఖిత, కోలా చందన, కరు ణాకర్, రాజేష్‌లు వివరిస్తూ డెమో ప్రాక్టికల్ ద్వారా చూపించారు. ఈడెమోలో మొదటి ఐదు నిమిషాలు చాలా కీలకమని హార్ట్ బీట్, పల్స్, శ్వాస చెక్ చేయాలని దాని లో ప్రతి నిమిషా నికి 100 నుంచి 120 సార్లు కంప్రెషన్ చేయాలని, ప్రతి 30 సార్లు కంప్రెషన్ చేసి మౌత్ టు మౌత్ బ్రీతింగ్ ఇవ్వా లని చెప్పారు. సిపిఆర్ ని చాలా చక్కగా వివరంగా సరళమైన భాషలో వివరించినందుకు ఆ విద్యార్థులను కళాశాల డైరెక్టర్ ఎ.ఆర్. ధనుం జయ, ప్రిన్సిపాల్ బ్రహ్మ చారి అధ్యాపకులు అభినందించారు.

పశ్చిమలో మూడు అన్న క్యాంటీన్లకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - భవానీపురం : పశ్చిమ నియోజకవర్గంలోని మూడు అన్నా క్యాంటీన్లను శాసనసభ్యులు సుజనా చౌదరి ఆదేశాల మేరకు ఆగస్టు 15న పునఃప్రారంభించడానికి పనులను వేగవంతం చేశామని ఎంఎల్ఏ కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ తెలిపారు. వీఎంసి జోనల్ కమిషనర్ రమ్య కీర్తన ఇతర ప్రభుత్వ అధికారులతో కలిసి శుక్రవారం కాశేశ్వరరావు మార్కెట్, భవానీపురం, హెచ్.బి.కాలనీలలోని, అన్నా క్యాంటీన్ల భవనాలను ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు.

పింగళి వెంకయ్య జయంతి

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక ఎల్‌బిఆర్ సిఇ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం పింగళి వెంకయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు మాట్లాడుతూ నేటి యువత పింగళి వెంకయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి శివ హరిప్రసాద్, పాల్గొన్నారు. **గంపలగూడెం:** స్థానిక విశిష్ట జూనియర్, డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళు లర్పించారు. అనంతరం పింగళి వెంకయ్య విశిష్టతను వివరించారు. డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌లు వరుసగా, విజాల రెడ్డి, ఆర్.శివకృష్ణ, జీవి అకాడమీ జోనల్ హెడ్ ఎన్.కల్పన, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ దేవస్థానం ఇఒగా లీలాకుమార్ బాధ్యతల స్వీకరణ

పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా డిప్యూటీ కమిషనర్ జి.వి.డి.యన్ లీలాకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్ నాయుడు రెవెన్యూ శాఖకు బదిలీ అయ్యారు. విజయవాడ శ్రీ కనక దుర్గా మల్లేశ్వరల దేవస్థానం అదనపు కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న లీలా కుమార్‌ను తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దర్శనం అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

కమిషనర్‌ను కలిసి వెంకట సత్యనారాయణ, బండినాగేంద్ర పుణ్యశీల, జమలపూర్ణమ్మ తదితరులు

విఎంసి కమిషనర్‌ను కలిసిన వైసిపి కార్పొరేటర్లు

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రను శుక్రవారం తన ఛాంబర్‌లో వైసిపి కార్పొరేటర్లు మర్యాద పూర్వకంగా కలిసి, పూల మొక్కను అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో వైసిపి ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్లు బండినాగేంద్ర పుణ్యశీల, కోఆప్షన్ సభ్యులు జమలపూర్ణమ్మ తదితరులు ఉన్నారు. ఇదే సందర్భంలో తమ తమ వార్డులోని సమస్యలను కమిషనర్‌కు కార్పొరేటర్లు వివరించారు.

ఉపాధి హామీ కూలీల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఎ.కొండూరు : ఉపాధి హామీ కూలీలకు వెంటనే పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరుతూ మండల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎ.కొండూరు యంపిడిం కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడుతూ మేలో పనిచేసిన కూలీల బకాయిలు నేటి వరకు చెల్లించలేదని, కొన్ని గ్రామాల్లో పనులు పూర్తి కాకుండానే ఆపేశారని, వెంటనే పనులు ప్రారంభించాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కోసం నిధులు కేటాయించి ప్రభుత్వం ప్రకటించిన 300 రూపాయల చొప్పున కూలీ ఇవ్వటం లేదన్నారు. గత ఎనిమిది వారాల క్రితం పనిచేసిన కూలీల డబ్బులు విడుదల చేయాలని, వ్యవసాయ పనులు లేక కూలీలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని అధికారులు వెంటనే స్పందించి రూ.300 కూలితోపాటు కూలి బకాయిలు చెల్లించాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పానెం ఆనందరావు, సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరావు, రైతు సంఘం నాయకులు అమ్మిరెడ్డి, జి.కృష్ణారెడి, కూలీలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కమిషనర్‌తో బిల్డర్ల సంఘ నాయకులు

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన బిల్డర్స్ అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రను బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం కలవడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్‌కు బాయ్ ఏపీ ఛైర్మన్ అత్తులూరి నాగమల్లేశ్వరరావు బిల్డర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇవ్వడం జరిగింది. వారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ వారిని కలిసిన వారిలో బిఏఐ అమరావతి సెంటర్ జనరల్ సెక్రెటరీ బి. శివకుమార్ పట్నాయక్, సీనియర్ సివిల్ ఇంజనీర్ సత్యనారాయణ, బిల్డర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ రాజశేఖర్, పలువురు బిల్డర్లు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్లలో గల ఎన్టీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య శుక్రవారం పంపిణీ చేశారు. కాలేజి ప్రిన్సిపాల్ షేక్ హఫీజ్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖవైద్యులు డాక్టర్ పుల్లగూర ప్రభాకరరావు, మండల టిడిపి అధ్యక్షుడు కోగంటిబాబు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో కాలేజీ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

అన్నదానం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక ప్రముఖులు రాయన ప్రతాప్ జయంతి సందర్భంగా ఆయన మిత్రబృందం శుక్రవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి రాయన శ్రీకాంత్, శేఖర్, రమేష్, సతీష్, శివ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

ప్రజాశక్తి - వీరులపాడు : పొన్నవరం గ్రామంలోనే మండల ప్రజా పరిషత్ పాఠశాలను స్థానిక శాసనసభ్యులు తంగిరాల సౌమ్య సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఎంఎల్ఏ సౌమ్య మాట్లాడుతూ ఐదేళ్లలో భ్రష్టుపట్టించిన విద్యా వ్యవస్థను కూటమి ప్రభుత్వం సమూలంగా ప్రక్షాళన చేస్తుందని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. గురువారం నాడు మండలంలోని పొన్నవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ క్రమంలో విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యాలయాలను రాజకీయాలకు అతీతంగా సరస్వతీ నిలయాలుగా తీర్చిదిద్దుతామన్నారు.

డ్రైనేజీల్లో మురుగు తొలగింపు

ప్రజాశక్తి - చందర్లపాడు : మండలంలోని పున్నవల్లి గ్రామంలో శుక్రవారం డ్రెయినేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. కొద్ది రోజుల క్రితం కురిసిన అకాల వర్షాల కారణంగా కాలువలో చెత్త, చెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తుండటంతో స్థానిక గ్రామ సర్పంచ్ డాక్టర్ కోట మోహనరావు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది పూడిక తీత పనులు చేపట్టారు. డ్రైనేజీ కాల్వలకు ఇరుపక్కల ఉన్న కంపచెట్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా శాంతిలక్ష్మి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు మండలం నూతన తహశీల్దారుగా ఎ.శాంతి లక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ టౌన్ నుంచి ఆమె ఇక్కడికి వచ్చారు. ముందుగా అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. వారికి రెవెన్యూ అధికారులు స్వాగతం పలికారు.

దుర్గమ్మను దర్శించుకున్న నిహారిక

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను ప్రముఖ చిత్రనటులు, నిర్మాత కొణిదెల నిహారిక శుక్రవారం శ్రీ అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించారు. తదుపరి వీరికి వేదపండితులచే వేదాశీర్వచనం కల్పించిన అనంతరం ఆలయ ఈవో అమ్మవారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తుల రద్దీ..

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను దర్శించుకునేందుకు శుక్రవారం కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు, యాత్రికులు విచ్చేశారు. విశేషంగా విచ్చేసిన భక్తుల రద్దీ, మరియు ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారికి పవిత్ర సారె సమర్పించేందుకు వచ్చే యాత్రికుల సౌకర్యాలను ఇఒ రామారావు పర్యవేక్షించారు.

కొణిదెల నిహారికకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇఓ రామారావు

కంచికచర్ల తహశీల్దార్‌గా జాహ్నవి బాధ్యతలు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల తహశీల్దార్‌గా పి.జాహ్నవి శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. విజయవాడ రూరల్ లో పనిచేస్తున్న ఆమెను సాధారణ బదిలీల్లో భాగంగా జాహ్నవిని జిల్లా కలెక్టర్ సృజన బదిలీ చేశారు. తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జాహ్నవిని డిప్యూటీ తహశీల్దార్ నాగులుమీరా, సిబ్బంది కలిశారు.

వసతి గృహాల్లో వసతులు కల్పించాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి కలక్టరేట్(కృష్ణా) : జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డికే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ బీసీ వసతి గృహాల్లో మౌలిక వసతులు, అడ్మిషన్లు, అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ పథకాలు, సమస్యలపై ఆయన సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మరుగుదొడ్లు, సురక్షితమైన తాగునీరు, ఇతర వసతులపై అధికారులు దృష్టి సారించాలన్నారు. వికలాంగులకు చేతి కర్రలు, వినికిడి పరికరాలు, మూడు చక్రాల సైకిళ్ల పంపిణీపై ఆరా తీసి అధికారుల నుండి వివరాలను తెలుసుకున్నారు.బీసీ సంక్షేమ శాఖలో విధులు నిర్వర్తించేందుకు తీవ్రమైన సిబ్బంది కొరత ఉందని జిల్లా అధికారి కలెక్టర్కు తెలుపగా, దీనిపై సంబంధిత ప్రిన్సిపల్ సెక్రెటరీకి రాతపూర్వకంగా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డిడి షాహిద్ బాబు షేక్ ,బీసీ కార్పొరేషన్ ఈడీ కే శంకర్ రావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి రమేష్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి బి ప్రకాష్ రావు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలలో ఆస్తి పన్ను వసూళ్లు, శానిటేషన్ మెరుగుపరచాలి

మున్సిపాలిటీలలో ఆస్తి పన్ను వసూళ్లు, శానిటేషన్ మెరుగుపరచాలని, పట్టణాభివృద్ధి పథకాల కింద చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డికే బాలాజీ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్లో మినీ కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీరాజ్, పురపాలక పట్టణాభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు అన్ని మున్సిపాలిటీలలో ఆస్తి పన్ను వసూళ్లు మున్సిపాలిటీల వారీగా సమీక్షించారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా డ్రైనేజీలలో సిల్ట్ తీయించడం, శానిటేషన్ డ్రైవ్ చేపట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంఎల్ఎ వెనిగండ్ల రాము

ప్రభుత్వాసుపత్రిలో తనిఖీ

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఓపి రిజిస్టర్ తనిఖీ చేసి సక్రమంగా మందులు అందుతున్నా యా లేదా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. చికిత్సలు అందించడంలో నిర్లక్ష్యం వహించినా, ఏదైన సమస్యలు తలెత్తినా ప్రజా వేదికలోని తన కార్యాలయం దష్టికి తీసుకువస్తే తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. గుడివాడ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఆసుపత్రి సూపరిండెంటెంట్ ఇందిరా దేవి, వివిధ విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకారం

ప్రజాశక్తి -పమిడిముక్కల : ప్రజా, రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తానని పమిడిముక్కల తహశీ ల్దారుగా బాధ్యతలు చేపట్టిన కే. నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తాసిల్దార్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల తర్వాత జరిగిన బదిలీలలో పమిడిముక్కల మండలానికి వచ్చారు. డిటి జోజిబాబు, కొడాలి ఏసు పాదం, రెవెన్యూ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

మండలాభివృద్ధికి శ్రీనివాస్ ఎనలేని కృషి : ఎంపిపి



శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండల అభివృద్ధికి ఎఓగా, ఇంచార్జ్ ఎంపీడీవోగా దారపు శ్రీనివాస్ ఎనలేని కృషి చేశారని ఎంపీపీ కొడాలి సురేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు మందిరంలో దారపు శ్రీనివాసరావు పదవీ విరమణ అభినందన సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కొడాలి సురేష్ మాట్లాడుతూ ఆయన మచిలీపట్నం జిల్లా పరిషత్లో 20 సంవత్సరాలు , డిఆర్డిఎలో పది సంవత్సరాల పాటు పనిచేస్తు ఎన్జీవోస్ అసోసియేషన్ యూనియన్ లో అనేక పదవుల ద్వారా ఉద్యోగస్తులకు సహాయ సహకారాలు అందించారని అన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సంపూర్ణంగా అందించడంలో ఆయన కషి అభినంద నీయమని అన్నారు. పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి కష్ణవేణి, ఇన్చార్జి తాసిల్దార్ కనకదుర్గ, నందివాడ ఎంపీడీవో నాగేశ్వరరావు, ఇఒపిఆర్డి దిలీప్ కుమార్, ఎంఈఓ 1 జగన్మోహన్ రావు, ఎంఈఓ 2 జి గోపాల రావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు ఏ జె ఎల్ నరసింహ రావు, సి హెచ్ ఉమామహేశ్వరరావు, రమేష్, ఎలీషా రావు, గోవర్ధన్ రావు, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ, సచివాలయం, వెలుగు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొని దారపు శ్రీనివాస్ ఉషారాణి దంపతులను నూతన వస్త్రాలతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

నోటు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : జూనియర్ కళాశాలలో విద్యన భ్యసించే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు నోట్ బుక్స్ బ్యాగులు పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శుక్రవారం పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న ఈ బహుమతిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి రేఖ రాణి అధ్యక్షత వహించగా కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి ఎన్ బి గోపాల్ అధ్యాపకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠంలో 2024-25 విద్యా సంవత్సరంలో పదవతరగతి, ఇంటర్మీడియట్ తరగతులలో ప్రవేశాలకు ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ జి. నాగమణి సూచించారు. ఈ సందర్భంగా ఆర్జేడి మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరం నకు పదవతరగతి, ఇంటర్మీడియట్ లలో ప్రవేశం కొరకు అపరాధ రుసుము లేకుండా ఈ నెల 27 వరకూ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారన్నారు. కావున ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జిల్లా విద్యా శాఖాధికారి తాహెరా సుల్తానా మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల బడి మధ్యలో మానేసిన వారు, ఎటువంటి పూర్వ విద్యార్హత లేకపోయినా 14 సంవత్సరాల వయసు నిండిన వారంతా పదవతరగతిలో ప్రవేశం పొందవచ్చునన్నారు. అంతేకాక పదవతరగతి పాస్ అయి 15 సంవత్సరాలు వయసు నిండిన వారంతా ఇంటర్మీడియట్ తరగతులలో ప్రవేశం పొందవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్నిఅంగన్వాడి, ఆశా వర్కర్, డ్వాక్రా మహిళలు, ఆటో డ్రైవర్, వివిధ వత్తులలో ఉన్నవారంతా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు www.a popen-school. ap.gov.in ఎ.పి.ఆన్-లైన్ /ఏ.ఐ కేంద్రాల ద్వారా ధరఖాస్తు చేసుకోవచ్చున్నారు. వివరాలకు ఓపెన్ స్కూల్ హెల్ప్ లైన్ నెం- 8008403506 సంప్రదించాలన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గోడ పత్రికలను, కరపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమములో కష్ణా జిల్లా పరీక్షల విభాగంసహాయ కమీషనర్ యం. డేవిడ్ రాజు , ఉప విద్యాశాఖాధికారి, మచిలీపట్టణం, ఉప విద్యాశాఖాధికారి, గుడివాడ, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయము నందు గల పర్యవేక్షకులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న అధికారులు



నూతన సభ్యులకు సభ్యత్వాన్ని అందజేస్తున్న వెంకట్ రామ్.

సభ్యత్వ నమోదు పరిశీలన

ప్రజాశక్తి-అవనిగడ్డ : జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతంగా నిర్వహించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తనయుడు, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్ రామ్ పిలుపునిచ్చారు. శుక్రవారం అవనిగడ్డ తాసిల్దార్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన శిబిరంలో మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్ర మాన్ని వెంకట్రాం పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన సభ్యులకు వెంకట్ రామ్ సభ్యత్వాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనసేన సభ్యత నమోదులో అవనిగడ్డ నియోజకవర్గం మరోసారి మొదటి స్థానంలో నిలిచేలా క్రియాశీలక సభ్యత్వ నమోదు వాలంటీర్లు మరింత కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోసూరు అవినాష్, గుడివాక రామాంజనేయులు, సింహాద్రి, బుజ్జి, మహిళా నాయకులు బచ్చు కష్ణకుమారి, బం దే నాగమల్లేశ్వరి, గుగ్గిలం అనిల్ కుమార్, పప్పుశెట్టి శ్రీను, రేపల్లె రోహిత్, అడపా ప్రభాకర్ పాల్గొన్నారు.

సాంకేతికతతో వరిలో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-ఉయ్యూరు : మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక సాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొంద వచ్చని సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ ఏడీఏ శ్రీనివాస్ తెలిపారు. ఎగినపాడులో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్షల వల్ల ఉపయోగాలు తెలియజేసి వరి నాట్లు వేసిన 30 రోజుల్లో కలుపుతీత వంటి సస్యరక్షణ చర్యలతో పాటు నీటి యాజ మాన్య పద్ధతులు పాటించాలని, సామూహిక ఎలుకల నిర్మూలన రైతులు చేపట్టాలని సూచించారు. చెరకు పరిశోధనా స్థానం శాస్త్రవేత్త సుధారాణి, వ్యవసాయ అధికారి పద్మజ తదితరులు పాల్గొని రైతులకు పలుసూచనలు చేశారు.

ప్రజా శ్రేయస్సే ధ్యేయం : సర్పంచ్

ప్రజాశక్తి-పెదన : ప్రజలకు ఆరోగ్య, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని సర్పంచ్ జోగి నాగవరలక్ష్మి రమణ పేర్కొన్నారు. వర్షాకాలం పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని బల్లిపర్రు పంచాయతీ రక్షిత మంచినీటి సరఫరా అలాగే రోడ్డు, డ్రైనేజీలను వరలక్ష్మి రమణ ఎంపీడీవో రెడ్డియ్యతో శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా తన దష్టికి తీసుకురావాలని గ్రామస్తులను కోరారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలకు మౌలిక సౌకర్యాలతో పాటు గ్రామీణ ప్రాంతాలకు పెద్దపీట వేస్తుందన్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే బల్లిపర్రు శివారు హనుమాన్ కాలనీ అలాగే పాత బల్లిపర్రులోని అంతర్గత రోడ్లు సిమెంట్ రోడ్లుగా వేసేందుకు కషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బొల్ల నాగరాజు, జనసేన, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళను కొట్టి నగలు చోరీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఓ గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి మహిళలను పిడుగుద్దులు గుద్ది ఆమె పడిపోయాక ఆమె మెడలోని బంగారు నగలు దోచుకుపోయిన సంఘటనపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సిండికేట్ బ్యాంక్, కలరా ఆస్పత్రి, చిట్టినగర్‌లో చేమకుర్తి సంధ్య నివసిస్తుంది. ఈమె భర్త సిండికేట్ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేసి రిటైరయ్యారు. అయితే ఆయన కరోనా సమయంలో మృతిచెందారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. ముగ్గురికి వివాహాలు అయ్యాయి. సంధ్య ఒక్కతే ఇంటిలో ఉంటుంది. ఈ నేపధ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ఆకుకూరలు అమ్మె అబ్బాయి వస్తే గోంగూర కట్ట కొనుగోలు చేసి లోలపకు డబ్బులు తెద్దామని సంధ్య వెళ్ళింది. ఇంతలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి ఆమె చేతులు గట్టిగా పట్టుకుని పిడుగుద్దులు గుద్ది గోడకేసి కొట్టాడు. దీంతో ఆమె స్రృహ కోల్పోయి కుప్పకూలిపోయింది. వెంటనే ఆమె మెడలో ఉన్న బంగారపు చైన్ (సుమారు మూడు కాసులు), శామ్‌సంగ్ సెల్‌ఫోన్ చోరీ చేసి పారిపోయాడు. సంధ్య రెండో కుమార్తెకు ఫోన్ చేసి వారి బంధువుల సహకారంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం వెళ్లింఇద. సమాచారం అందుకున్న టూటౌన సిఐ గణేష్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

బైక్‌పై నుండి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : బైక్‌పై నుండి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన పెయింటర్ జ్యోతి గోపి (26) చిల్లకల్లు నుండి పనస బాట రోడ్డు మార్గంలో పోచంపల్లి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. మార్గమధ్యలో బైక్ అదుపు తప్పడంతో పడిపోయి మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు.

కోర్టు ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : శాసన సభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), ఎపి హైకోర్టు న్యాయ మూర్తి యు.దుర్గా ప్రసాద్‌లకు శుక్రవారం వేరు వేరుగా జగ్గయ్య పేటలో సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ఏర్పాటు జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపాగ సుందరరావు, సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది గండికోట శ్రావణ్ కుమార్, న్యాయవాదులు ఎం ఆంజనేయులు, గాంధీ పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై శిక్షణ

ప్రజాశక్తి - తిరువూరు : మండలంలోని కొమ్మిరెడ్డి పల్లి గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సౌజన్యంతో భూ పరీక్ష ఫలితాల ఆధారంగా సమతుల ఎరువుల వాడకంపై రైతులకు శుక్రవారం శిక్షణ ఇచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి పి.పద్మ తెలిపారు. ట్రైకోడెర్మ విరిడి వాడకంతో పత్తి, మిరప పంటలలో వేరుకుళ్ళు, ఎండు, వడలు తెగులును అదుపులో ఎలా ఉంచాలో అనేదానిపై ముఖ్యంగా రైతులకు వివరించాంన్నారు. కేజీ విత్తనాలకు 8 నుండి 10 గ్రాముల ట్రైకోడెర్మ పొడిని కలిపి ఎకరానికి రెండు లేదా మూడు కిలోల కల్చర్‌ను 90 కిలోల మాగిన పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండితో కలిపి తేమ ఉండునట్లుగా నీళ్ల చల్లి గోనె సంచులతో కప్పి ఉంచాలని తెలిపారు.ఎండ వేడి తగలని ప్రాంతంలో నిల్వ చేయాలని తెలిపారు.

ఇసుక లారీలు స్వాధీనం

ప్రజాశక్తి - తిరువూరు : సుమారు 60 టన్నుల లోడుతో తెలంగాణకు తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదుచేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. కంచకచర్ల మండలం, కేసర ఇసుక సీనరేజ్ నుండి జి.కొండూరు మండలం, కవులూరుకు చెందిన ధర్మారావు తనకు చెందిన రెండు పెద్ద లారీల్లో ఇసుకను నింపుకుని తెలంగాణ రాష్ట్రానికి గురువారం రాత్రి తరలిస్తుండగా సరిహద్దు పెద్దవరం గ్రామం వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. ఓనర్ పై, ఇద్దరు డ్రైవర్లపై ఓల్టా చట్టం, క్రిమినల్ సెక్షన్ కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. గతంలో తిరువూరుకు చెందిన కొంతమందికి ఇసుక తోలిన ధర్మారావు ఇప్పుడు వాళ్ల ఆధార్ నెంబర్లతో అన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసి టోకెన్‌లు తీసుకుని ప్రభుత్వాన్ని మోసం చేసి ఇసుకను తెలంగాణకు తరలిస్తున్నాడని ఎస్ఐ చెప్పారు.

నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - తిరువూరు : ఏపీ ప్రయివేట్ స్కూల్స్ డెమోక్రటిక్ అసోసియేషన్ తిరువూరు నియోజకవర్గ అధ్యక్షులు తిరువూరు నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ కె.నరసింహారావు, కార్యదర్శిగా విస్సన్నపేట శ్రీశ్రీ పాఠశాల ప్రిన్సిపల్ ఎన్. వెంకట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరువూరులోని గీతం స్కూల్‌లో అసోసియేషన్ నియోజవర్గ జనరల్ బాడీ సమావేశం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎన్.బి.చారి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా అసోషియేషన్ జిల్లా చైర్మన్ జి.మోహన్ రావు అసోసియేషన్ అభివృద్ధి గురించి, ప్రయివేట్ స్కూల్స్ ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పారిష్కారం, భవిష్యత్తులో వచ్చే సమస్యలను సంఘటితంగా ఎలా ఎదుర్కోవాలో ఆయన వివరించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అసోసియేషన్ తిరువూరు నియోజకవర్గ నూతన కమిటీకి ఎన్నికలు జరిగాయి. సభ్యులందరూ ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. నరసింహారావు, వెంకట్‌తో పాటు కోశాధికారిగా బి.సీతారామిరెడ్డి, సహాయక అధ్యక్షులుగా కెవి.హేమకృష్ణ, ఇది జాయింట్ సెక్రటరీగా బి.వాణి తదితరులను ఎన్నుకున్నారు.

చెరువు బ్యూటిఫికేషన్ పనుల పరిశీలన

జగ్గయ్యపేట: పట్టణంలో గల ఊర చెరువును మునిసిపల్ శాఖ మరియు ఇరిగేషన్ శాఖ అధికారులు, నాయకులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర రావు పరిశీలించారు. దీనిలో భాగంగా ఎర్రకాలువ ద్వారా చెరువులోకి వచ్చే నీటిని రాకుండా ఆపివేయడం వల్ల చెరువులో పూర్తిస్థాయిలో నీటిమట్టం పడిపోతుందన్నారు. వేపల వాగు ద్వారా చెరువులోకి వచ్చే నీటిని డైవర్షన్ చేసి బయటకు తరలించడం వల్ల చెరువు కింద ఉన్న ఆయకట్టు రైతులు సాగునీరు లేక పంటలను వేసుకోలేకపోయారన్నారు. దీనిపై మున్సిపల్, ఇరిగేషన్ శాఖ వారితో సమావేశం ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో చెరువులోకి నీరు వచ్చేలా ఏర్పాటు చేసి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని ఎంఎల్‌ఎ సూచించారు.

ఇనాం భూముల సమస్యపై వినతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట నియోజకవర్గంలో సుమారు 1,100 ఎకరాల ఇనాం భూముల సమస్యను పరిష్కరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య విన్నవించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. జగ్గయ్యపేట నియోజకవర్గం పరిధిలోని పలువురి భూములు స్థలాలు ఇనాం భూములుగా గుర్తించి నిషేధిత జాబితాలో చేర్చి ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. దీనివల్ల క్రయవిక్రయాలు జరగకపోవడంతో పాటు నివాసాలు నిర్మించుకోవడానికి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని వినతి పత్రం ద్వారా తెలిపారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి - వీరులపాడు : మండలం పెద్దాపురం, జుజ్జూరు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల వద్ద శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా తల్లిపాల విశిష్టతను ఆమె వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విలువైన పోషకాలు తల్లిపాలతో బిడ్డకు అందుతాయని బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల ఆమెకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ,రమావత్ కోటి, ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రభావతి అంగన్వాడి కార్యకర్తలు పసుపులేటి వాసవి బాధితులు గర్భిణులు పాల్గొన్నారు. **వీరులపాడు :** మండలంలో జుజ్జూరులో ముస్లిం ఏరియాలో అంగన్వాడీ సెంటర్లో తల్లిపాలుపై అవగాహన కార్యక్రమం శుక్రవారం ఉదయం ఐసిడిఎస్, అల్లూరు ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రభావతి మాట్లాడుతూ బిడ్డ జన్మించిన వెంటనే తల్లి పాలు పట్టాలని దానివల్ల తల్లికి పసిబిడ్డలకు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ పసుపులేటి ఉష అల్లూరు ఆరోగ్య సిబ్బంది జ్యోతి రాణి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** మైలవరం ప్రాజెక్ట్ ఈలప్రోలు సెక్టార్ కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర థియేటర్ ఏరియా మరియు వివిఎం అంగన్వాడీ కేంద్రాలలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా సెక్టార్ సూపర్వైజర్ జి రమాదేవి మాట్లాడుతూ ఆగస్టు 1 నుండి ఆగస్టు 7 వరకు అంగన్వాడి వర్కర్లు ఆశా ఏఎన్ఎంలు, లబ్ధిదారులు మరియు కేర్ టేకర్లు అందరికీ ప్రత్యేక కమ్యూనిటీ ఆధారిత ఈవెంట్ ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త డి పద్మ కుమారి, సి హెచ్ జమలమ్మ, హెల్పర్ కే విజయనిర్మల ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **భవానీపురం :** తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని, ఆరోగ్యకరమని ఐసిడిఎస్ ప్రాజెక్ట్-1 సూపర్‌వైజర్ జి.ప్రశాంతి తెలిపారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 42వ డివిజన్ భవానీపుం, హెచ్.బి. కాలనీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహనా కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుభాషిణి, అమిత, ఉమాదేవి, గాయత్రి, వరకుమారి, మహిళా పోలీసులు, ఎఎన్‌ఎంలు, ఆషాలు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** పట్టణంలోని పెద్ద రామాలయం సమీపంలోని అంగన్వాడి కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల సభలో శుక్రవారం ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు గొట్టే నాగరాజు, సంగెపు బుజ్జిబాబు, అధికారులు పాల్గొన్నారు. **చందర్లపాడు :** తల్లిపాలు అమృత తుల్యమని, వాటి విశిష్టతను వివరిస్తూ మండల కేంద్రమైన చందర్లపాడులో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆయాలు అంగన్వాడీ పిల్లల తల్లిదండ్రులతో ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు జరిగే తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిడిపిఒ భాగ్యరేఖ మాట్లాడారు. శిశుమరణాలు తగ్గాలంటే తల్లిపాలు ఆరు నెలల పాటు నిరంతరాయంగా బిడ్డకు తల్లిపాలనే పట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ చందర్లపాడు సూపర్వైజర్ శ్రీలత ఏటూరు సూపర్వైజర్ శ్రీదేవి ముప్పాళ్ళ సూపర్వైజర్ ఇస్రాత్ అంగనవాడీ కార్యకర్తలు అంగనవాడీ పిల్లల తల్లిదండ్రులు సిబ్బంది పాల్గొన్నారు.

ఖాజాకు విమలభాను ఫౌండేషన్ సన్మానం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్న బాల సైదా సేవా సమితి అధ్యక్షులు షేక్ ఖాజా సేవలు పలువురికి స్ఫూర్తిదాయకమని మాజీ ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. సామినేని ఉదయభాను జన్మదిన వేడుకల్లో భాగంగా జగ్గయ్యపేటలో సొంత నిధులతో వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్న బాల సైదా సేవా సమితి అధ్యక్షులు షేక్ ఖాజాను విమలభాను ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను వారి సతీమణి ఫౌండేషన్ చైర్మన్ విమలభాను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ డ్రిల్లింగ్ పనులు చేస్తూ తనకు ఉన్న దానిలో పలువురికి సేవా కార్యక్రమాలు చేస్తున్న ఖాజా సేవలు అభినందనీయమన్నారు. ఉచిత అంబులెన్స్‌ను ఏర్పాటుచేసి ఆపదలో ఉన్నవారిని ఆసుపత్రికి చేరుస్తూ సేవ చేస్తున్నారన్నారు. వృద్ధులైన భవన నిర్మాణ కార్మికులకు సొంత నిధులతో పెన్షన్‌ను అందిస్తున్నారని చెప్పారు. సామినేని ఉదయభాను జన్మదిన వేడుకలు పట్టణంలో ఘనంగా జరిగాయి. వైసిపి మైనార్టీ నాయకులు షేక్ జుబేర్, పటాన్ ఫిరోజ్ ఖాన్, అక్బర్ ఖాన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ గజమాలతో ఉదయభాను దంపతులను సన్మానించారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - వీరులపాడు : వివిధ గ్రామాల్లో అభివృద్ధి కోసం ఎంఎల్ఎ నిధుల నుండి ఐదు కోట్లు నిధులు మంజూరైనట్లు టిడిపి మండల అధ్యక్షులు కె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల అభివృద్ధి కోసం అంచనాలు రూపొందించి ఆయా శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గ్రామాల్లో ఈ నిధులతో సిమెంటు నిర్మాణం చేపడుతున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు కె.శ్రీనివాసరావు తెలిపారు.

డ్రైనేజీ పూడికతీత పనులు

ప్రజాశక్తి - మైలవరం : గ్రామంలోని డ్రైనేజీ కాలువల పూడిక తీత పనులకు ఎన్టీఆర్ జిల్లా తెలుగు యువత అధ్యక్షులు లంక నితీష్ శ్రీకారం చుట్టారు. శుక్రవారం జెసిబి సాయంతో పంచాయతీ సిబ్బంది సహకారంతో పూడికతీత పనులు చేపట్టారు. ప్రజల సమస్యలపై స్పందించిన శాసనసభ్యులకు, ఆ పార్టీ నాయకులకు ప్రజలు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - వత్సవాయి : కార్యకర్తలకు అండగా వైసిపి ఉంటుందని మాజీ ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జగ్గయ్యపేట పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వత్సవాయి మండలం, లింగాల గ్రామ సచివాలయ కన్వీనర్ అంబోజి వెంకటకృష్ణ కుటుంబానికి రూ.5 లక్షలు బీమాచెక్కును శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడారు.

శాకంబరీగా అలంకరణ

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్లలో గల శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆషాడ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా శ్రీ వాసవి విగ్రహానికి వివిధ రకాల కూరగాయలతో శాఖాంబరిదేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు శంకర్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు లలలితా సహస్రనామం విష్ణు సహస్రనామం పారాయణం చేస్తూ జై వాసవి జై జై వాసవి అంటూ నామస్మరణంతో పారాయణ కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

ఆషాఢం సారె సమర్పణ

ప్రజాశక్తి - వత్సవాయి : మండల కేంద్రమైన వత్సవాయి గ్రామంలో మహామేరు శ్రీ చక్ర వాసవి కన్యకా పరమేశ్వరి దేవి సహిత నవ ఉప ఆలయంలో క్షేత్ర ప్రాంగణంలో వేంచేసి ఉన్న అమ్మవార్లకు మహిళా భక్తులచే ఆషాడమాసం సందర్భంగా అత్యంత వైభవోతంగా ఆషాడ సారె అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం వాసవి అమ్మవారిని వెండి చీరలో అలంకరించి, మహిళా యాత్రికులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూలతో పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు.

పింగళి వెంకయ్యకు నివాళులు

కృష్ణాయూనివర్శిటీలో...

చిలకలపూడిలో నివాళులర్పిస్తున్న ఎస్‌పి గంగాధర్‌రావు

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలం భట్లపెనుమర్రు గ్రామంలో జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతిని సొంత గ్రామం అయిన బట్ల పెనుమర్రు గ్రామంలో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. అలాగే పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. **ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ :** కృష్ణాజిల్లా వాసి పింగళి వెంకయ్య రూపొందించిన మువన్నెల జాతీయ పతాకం మన దేశానికి విశ్వవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చిందని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఆర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపకులపతి ఆచార్య ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ సమగ్రతను కాపాడడం, ప్రజల మధ్య సోదర భావం పెంపొందించే శక్తి జాతీయ పతాకం ద్వారా పొందుతా మన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం బాబూరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు భారీ జాతీయ పతాకం తో విశ్వవిద్యాలయంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎం వి బాసవేశ్వర్‌రావు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం కోటేశ్వరరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) :** పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం కలెక్టరేట్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పింగళి వెంకయ్య మన జిల్లా వాసి కావడం మనందరికీ గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో ఇన్చార్జి శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ముందడుగు వేయాలని భావితరాలకు అదే వెలుగు అని, కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు అన్నారు. స్థానిక చిలకలపూడి పోలీస్ స్టేషన్ దగ్గర గల పింగళి వెంకయ్య కాంస్య విగ్రహానికి జయంతి సందర్భంగా పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు. సీనియర్ జర్నలిస్ట్ చందమామ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడారు. బందరు డిఎస్పి అబ్దుల్ సుభాన్, సీనియర్ న్యాయవాది లంకి శెట్టి బాలాజీ, మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు వేణు, చిలకలపూడి సిఐ సతీష్, నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లో సర్కిల్ ఇన్స్పెక్టర్లు సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** గాంధీ క్షేత్రంలో పింగళి వెంకయ్య విగ్రహానికి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు నియోజకవర్గం యువ నాయకులు మండలి వెంకట్రాం, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, ప్రముఖ రంగస్థలం కళాకారులు ఉప్పాల వీరాంజ నేయులు, భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయ భాస్కర్ పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మన టీవీ భవనంలో నిర్వహించిన పింగళి జయంతి వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి వెంకయ్య చిత్రపటానికి పూలదండలు వేసి నివాళు లర్పించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకయ్య చిత్రపటానికి రమేష్ బాబు పూలదండలు వేసి నివాళు లర్పించారు. పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి గాజుల జయ గోపాల్, మాజీ సర్పంచ్ సైకం బాబురావు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ నాయకుల సంబరాలు

ప్రజాశక్తి ఘంటసాల : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వటం పట్ల ఎమ్మార్పీఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఘంటసాల మండలం కొడాలి సెంటర్లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందాకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం సెంటర్ నుంచి గూడెంలోని మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు దేవరపల్లి సతీష్ బాబు, కలపాల సాగల్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు కోన రాజశేఖర్, కొడాలి జాషువా పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** స్థానిక అంబేద్కర్ హాలులో గన్నవరం ఎమ్ఈయఫ్ వైస్ ప్రెసిడెంట్ దేవరపల్లి ఏసుబాబు ఆధ్వర్యంలో వర్గీకరణ సాధకులు మందా కష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. కొడాలి జోసఫ్, యమ్ఆర్ పి యస్ నాయకులు వేణు బాబు, నిడమర్తి నాగేశ్వరావు, డీజెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కొమ్మాని విజయ ప్రసాద్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ధర్మారం ఇచ్చిన తీర్పు సమంజసమని ఎమ్మార్పీఎస్ నాయకులు దినేష్ బాబు అన్నారు. శుక్రవారం పమిడిముక్కల మండలంలోని వీరంకిలాకు, హనుమంతపురం, కపిలేశ్వరపురంలో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు రావడంపట్ల మాదిగ దండాల నాయకులు సంబరాలు చేసుకున్నారు. పాతూరి చంద్రపాల్ పరససిల్వ బాబు పెనుమత్స రమేష్ కొల్లూరు దినేష్ కొడాలి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెండు రమణకు నివాళి

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీ పట్నం మండలం చిన్నాపురం గ్రామానికి చెందిన పాము కాటుకు నాటు వైద్యం అందించి వేలాది మంది ప్రాణాలు కాపాడిన మెండు వెంకటరమణ ప్రమాద వశాత్తు మృతి చెందడం భాదాకరమని మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్చార్జి బండి రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించి అనంతరం అంతిమయాత్రలో పాల్గొని వారికి కడసారి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, గడ్డంరాజు, బొమ్మసానిన రేష్,కాట్రం నాంచారయ్య,జన్ను నాగరాజు,చిలంకుర్తి పిచ్చేశ్వరరావు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారుల ధర్నా

ప్రజాశక్తి - గుడివాడ : టిడ్కో లభిదారులు 8900 మంది పేర్లు తొలగిస్తే అంగీకరించేది లేదని టిడ్కో కాలనీలోని బోర్డ్‌లో అందరి పేర్లు పెట్టాలని కోరుతూ టిడ్కో కాలనీ అభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ బొమ్మ ఎదురుగా గల సి.బ్లాక్స్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ కార్యదర్శి బసవ అరుణ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ లబ్ధిదారుల జీవితాలతో చేలాగటం ఆడుతున్నారన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన టిడిపి ప్రభుత్వం మళ్ళీ 500 పేర్లు తొలగించి కొత్తవి చేర్చుడానికి ప్రయత్నిస్తున్నారని, ఇదెంతవరకు సమంజసమని ప్రశ్నించారు. టిడ్కో కాలనీ ఉపాధ్యక్షులు ఎమ్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ వెంటనే లిస్టులు బయట పెట్టక పోతే పోరాటం ఉదతం చేస్తామని హెచ్చరించారు. ఓవర్ హెడ్ ట్యాంకు నుండి సరిపడా నీరు వదలడం లేదని గతంలో 3 గంటలు వదిలేవారు ఇప్పుడు గంట మాత్రమే వదులుతుంటే ఎవ్వరికీ నీరు సరిపడా అందటం లేదన్నారు. దీనికి ప్రతి బ్లాక్ వద్ద ఒక బోర్‌కి వెంటనే అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యక్షులు చాను, నాయకులు వంకినేని రంగారావు, చిన్నములు పాల్గొన్నారు.

శాకంబరీ ఉత్సవాలు

ప్రజాశక్తి - గుడివాడ : నీలామహల్ రోడ్డులోని శ్రీ విజయ దుర్గ అమ్మవారి దేవస్థానంలో శకంబరీ దేవి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం పలు దేవాలయాలలో అమ్మవారిని వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరల అలంకరణలో శ్రీ శాకాంబరీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి వేద పండితులు ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆషాడ మాస చివరి శుక్రవారం పురస్కరించుకుని దేవస్థానంలో శాకాంబరి ఉత్సవాలు నిర్వహించారు. ఈనెల ఐదో తేదీ నుండి దేవస్థానంలో శ్రావణ మాస పూజలు శాస్త్రోక్తంగా ప్రారంభం కానున్నాయి. **ప్రజాశక్తి-మోపిదేవి :** శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారి దేవస్థానంలో శాకంబరీ అలంకరణకు దాతలు కూరగాయలను వివిధ రకాల పండ్లను వితరణగా అందజేశారు. మోపిదేవి సుబ్రహ్మ ణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ ఘనాపాటి నవుడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్యేశ్వర శర్మ రెండు టన్నుల కూరగాయలను, ఆకుకూరలను వితరణగా అందజేశారు. అనంతరం ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే విజయవాడకు చెందిన ప్యూర్ ఓ నేచురల్ ఫ్రూట్స్ దుకాణం అధినేత బొర్ర సుధీర్ 12,000 రూపాయలు విలువగల పండ్లు అందజేశారు. వివిధ రకాల పండ్లను కూరగాయల అలంకరణతో అమ్మవారు భక్తులకు దర్శన మిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధర్ రావు, సూపరింటెంట్ సత్యనారాయణ, ఆలయ గుమస్తా రమణ, ఆలయ ప్రధానార్చకులు బుద్ధు ప్రసాద్, విజయ్ తదితరులు స్వామివారికి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

ఆషాడసారె సమర్పణ

పెదకళ్ళేపల్లి గ్రామంలో స్వయంభుగా వేంచేసియున్న శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం ఆషాడ మాసం సందర్భంగా శ్రీ దుర్గా , పార్వతి అమ్మవార్లకు మోపిదేవి శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నుండి ఆషాడ సారేను చల్లపల్లి ఎస్టేట్ దేవాలయముల ఉప కమిషనర్ కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు, ఆలయ సూపర్డెంట్ బొప్పన సత్యనారాయణ వేద పండితులు, అర్చక స్వాములు సమర్పించారు.

కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు మానవత స్వచ్ఛంద సంస్థ ఉయ్యూరు శాఖ సేవలందించింది. పాఠశాల ఆవరణలో 20 సెంట్ల భూమిలో మొక్కలు జేసీబీతో తొలగించి చదును చేసారు. మండల విద్యాశాఖ అధికారి- 2 బి. సుధారాణి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటుచేసి తద్వారా కూరగాయలు పండించి వాటితో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో సమతుల్యతతో కూడిన పోషకాహారం అందించాలన్న లక్ష్యం మేర మానవతా స్వచ్ఛంద సంస్థ సహకారం అభినందనీయమన్నారు. సంస్థ చైర్మన్ కొలసాని రవికుమార్, సాకి రాజేశ్, సభ్యులు ఫణికుమార్, నాగకుమార్, ఉపాధ్యాయులు జేవీ రమణ, జీ వీఎంవి లాల్ పాల్గొన్నారు.

బిసి హాస్టల్ తనిఖీ

భోజనం రుచిచూస్తున్న జడ్జి

ప్రజాశక్తి-పెదపారుపూడి : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గుడివాడ సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పెదపారుపూడి బీసీ హాస్టల్లో ఆగస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. హాస్టల్లో వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లక్ష్మీనారాయణ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడివాడ బారు అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బొల్లవరపు అజయ్ బాబు, న్యాయవాదులు రవి, విమల, ఏఎస్ఐ దుర్గారావు, హాస్టల్ వార్డెన్ బి వెంకటేశ్వరరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

సిఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి పెదపారుపూడి : అర్హులైన వారు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, ఆ పార్టీసీనియర్ నేత సూరపనేని వెంకట సత్యనారాయణలు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ 2024 మార్చి 1వ తేదీ నుండి అనివార్య కారణాల వలన అనారోగ్యం కలిగిన యెడల పామర్రు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆధ్వర్యంలో జరుగుతున్న నమోదు కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : విద్యాంజలి పోర్టల్‌లో పాఠశాలకు అవసరమైన సేవలు అప్లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పనుల పురోగతి సమీక్షిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాంజలి పోర్టల్ లో జిల్లాలోని అన్ని పాఠశాలలకు సంబంధించిన ఏమేమి అవసరాలు ఉన్నాయో అవన్నీ కూడా ప్రధానోపాధ్యాయుల ద్వారా అప్లోడ్ చేయాలన్నారు. అంతేకాకుండా ఆయా గ్రామాల్లో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్న పూర్వ విద్యార్థుల చిరునామాలు, ఫోన్ నెంబర్లు, ఈ -మెయిల్ అడ్రస్ లు అన్నీ కూడా సేకరించాలన్నారు.పూర్వ విద్యార్థుల ద్వారా ఆయా పాఠశాలలకు అవసరమైన వసతులు సేవలు సమకూ ర్చునేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా చేపట్టిన పోషకాహార పెరటి తోటలో పెంపక కార్యక్రమం 100 పాఠశాలలకు గాను 83 పాఠశాలల్లో ప్రారంభించడం శుభసూచకమని, మిగిలిన పాఠశాలల్లో కూడా సత్వరమే ప్రారంభిం చేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డి ఈ ఓ తహెరా సుల్తానా, సర్వ శిక్ష ఏ పి సి శ్రీరాములు నాయక్, ఆర్ఐ ఓ రవికుమార్, డిఐఈఓ పి.బి. సాల్మన్ రాజు ఉపవిద్యాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విసిబి విద్యా ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : 2023-24 విద్యా సంవత్సరంలో టెన్త్, ఇంటర్, ఎంసెట్, ఐఐటీ, నీట్ తదితర పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.31.85 లక్షలతో విద్యా ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు చెప్పారు. ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన అయిదుగురు విద్యార్థులకు శుక్రవారం విజయవాడ మొగల్రాజపురంలోని శారదా కళాశాలలో వీసీబీ పాలకవర్గ సభ్యులు శ్రీ అజయ్, శ్రీ బి.రామచంద్ర రావు అవార్డులు అందించారు. నూటికి 90 శాతం పైగా మార్కులు వచ్చిన 10వ తరగతి విద్యార్థులు ఎన్.మోక్షిత వెంకట సాయి (574), సాయి శ్రీ పేరం (471), ఇంటర విద్యార్థిని షైక్. ఆశ్ర పాతిమా (941), ఎం.గుణశేఖర్ (918), ఆర్.గీత శ్రీవల్లి (932) లకు చెక్కులు, మొమెంటోలు, మెరిట్ సర్టిఫికెట్‌లను కోటేశ్వర రావు, శ్రీ అజయ్, బి.రామచంద్ర రావు, కళాశాల జనరల్ మేనేజర్ జి.వి. రావు జోనల్ మేనేజర్ సి. సుబ్రహ్మణ్యం అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ 2005 నుండి బ్యాంకు విద్యా ప్రతిభ పురస్కారాలు అందజేస్తోందన్నారు. గత 19 సంవత్సరాలలో 4745 మందికి రూ.21.36 కోట్లు విలువైన చెక్కులను అందజేశామని చెప్పారు. బ్యాంకు సభ్యుల పిల్లలకు ప్రోత్సహించాలనే లక్ష్యంతో తక్కువ వడ్డీకి విద్యా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు.

మాజీ సిఎం జగన్‌ను కలిసిన మద్దిల

ప్రజాశక్తి - భవానీపురం : విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఏపి ఎస్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మద్దిల రామకృష్ణ (ఎంఆర్‌కె) మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర గిరిజన ప్రజల భవిష్యత్తు గురించి ముఖ్యంగా తమ హయాంలో చేపట్టిన గిరిజన యూనివర్సిటీలను ప్రస్తుత ప్రభుత్వం త్వరగా పూర్తిచేసి గిరిజన విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేలా మీరు వాటిపై తరచూ ప్రభుత్వంపై వత్తిడి తేవాలని కోరారు. రానున్న రోజుల్లో గిరిజన మహిళలపై దుష్ట ప్రచారాలు, అరాచకాలు, జరగకుండా గిరిజన మహిళలకు అండగా ఉండాలని జగన్‌ను కోరారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి సానుకూలంగా స్పం దించి అధికారం ఉన్నా, లేకున్నా గిరిజనులకు అన్ని వేళలా అండగా ఉంటానని ఆయన వారికి హామీ ఇచ్చారు.

భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవాలయం సారె సమర్పణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ ఆషాడ మాసం సంధర్భంగా ఇంద్రకీలాద్రి దేవస్థానంలో అమ్మవారికి శుక్రవారం భద్రాచలం శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థానం స్పెషల్ డిప్యూటీ కలెక్టం, కార్యనిర్వాహనాధికారి ఎల్. రమాదేవి సారె సమర్పించారు. వీరితో పాటు అనంత్ డైమండ్స్ (ఏఎన్ఆర్) బృందం 50 మంది, వైజాగ్ నుండి వల్లూరి మహేష్, హైదరాబాద్ వెంకటనారాయణ, విజయవాడ నుండి లక్ష్మీనగర్ కాలనీ, రాజరాజేశ్వరీపేట కె.సునీత, నరసరావుపేట నుండి పావనిల బృందాలు, వివిధ ప్రాంతాలకు చెందిన మొత్తం 25 బందాల వారు కలిపి మొత్తం 550 మంది పైగా బృంద సభ్యులతో శ్రీ కనకదుర్గ అమ్మవారికి సారె సమర్పించారు. వారికి ఆలయ ఇఒ కె.ఎస్.రామారావు, అధికారులు స్వాగతం పలికి శ్రీ అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేశారు.

4న నగరంలో వ్యాస్క్యులర్ సొసైటీ వాక్‌థాన్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : విజయవాడ:- నేషనల్ వ్యాస్క్యులర్ డే ను పురస్కరించుకొని వ్యాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 4న విజయవాడలో వాక్‌థాన్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రజా వైద్యశాల వ్యాస్క్యులర్ సర్జన్ మాకినేని కిరణ్ తెలిపారు. మహాత్మా గాంధీ రోడ్డులోని ప్రజా వైద్యశాలలో డాక్టర్ మాకినేని కిరణ్ శుక్రవారం విలేకరుల సమావేశంలో ముందుగా వాక్‌థాన్‌కు సంబంధించిన టి-షర్టులను డాక్టర్ శివ కష్ణ, డాక్టర్ రత్నశ్రీలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ, వరల్డ్ వ్యాస్క్యులర్ డే సందర్భంగా భారతదేశంలో కూడా నేషనల్ వ్యాస్క్యులర్ డే ను ఈ నెల 6న 36 నగరాల్లో చేస్తున్నామని చెప్పారు. దానిని పురస్కరించుకుని రక్త నాళాల జబ్బుల గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 4న ఆదివారం ఉదయం 7:30 గంటలకు వాక్‌థాన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాక్‌థాన్ ఇందిరాగాంధీ స్టేడియం నుంచి ప్రారంభమై ఏలూరు రోడ్డు మీదుగా వెళ్లి తిరిగి స్టేడియానికి చేరుకుంటుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఒకే సమయంలో ఈ వాక్ థాన్ నిర్వహించడం జరుగుతోందన్నారు.

మాట్లాడుతున్న వ్యాస్క్యులర్ సర్జన్ మాకినేని కిరణ్

వ్యాస్క్యులర్ సర్జరీ అంటే ఏమిటి, ఈ జబ్బుకు ఉన్న లక్షణాలు, వైద్యులను ఎప్పుడు సంప్రదించాలి, వారికి అందించే చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో వాక్‌థాన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. డాక్టర్ శివ కష్ణ మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ డైరెక్టర్ లక్ష్మి షా, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర పాల్గొని వాక్‌థాన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు.

తొలిసారిగా 32 నమూనాలతో వైజ్ఞానిక ప్రదర్శన

బ్రోచర్ ఆవిష్కరణలో పిబి సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ వెల్లడి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాలలోని భౌతికశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా రీసర్చ్ (అణు శక్తి విభాగం) సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా 32 నమూనాలతో కూడిన వైజ్ఞానిక ప్రత్యక్ష ప్రదర్శనను ఈ నెల 5నుండి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. ఈ విషయమై శుక్రవారం ఉదయం కళాశాలలోని సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ మేకా రమేష్ మాట్లాడుతూ ప్లాస్మా అంటే ఏమిటి?, ప్లాస్మా వల్ల ఉపయోగాలు ఏమిటి? ఇలాంటి అంశాలు గురించి విజ్ఞానం అందిస్తారని ఈ అవకాశాన్ని రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమ ప్రారంభ సభకు విజయవాడ మున్సిపల్ కమిషనర్ హెచ్.యమ్. ధ్యానచంద్ర ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఐదు రోజుల పాటు వివిధ పాఠశాలలు, కళాశాలల నుండి దాదాపుగా 5500 మంది వైజ్ఞానిక ప్రత్యక్ష ప్రదర్శనకు విచ్చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి రోజు ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ప్రదర్శన సాయంత్రం 4:30 గంటలకు ముగుస్తుందని

తెలిపారు. ఐదు రోజుల ప్రదర్శనలో ఆరుగురు శాస్త్రవేత్తలు మార్గనిర్దేశం చేస్తారని, వారి పర్యవేక్షణలో సిద్ధార్థ విద్యార్థులు నమూనాలను వివరిస్తారని పేర్కొన్నారు. ఈ నెల 7న ఉదయం 10 గంటలకు టీచర్ ట్రైనింగ్ కార్యక్రమం జరుగుతుందని ఈ అవకాశాన్ని పాఠశాల, కళాశాల బోధకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కళాల డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి జంపాల, సిద్ధార్థ అకాడమీ విద్యా సలహాదారు ప్రొఫెసర్ కె.ఎల్.మోహన్‌రావు, భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాస కష్ణ, అధ్యాపకుల బృందం, విద్యార్థులతో కలిసి ప్లాస్మా బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

నగరంలో 'కమిటీ కుర్రాళ్ళు' చిత్ర బృందం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలో కమిటీ కుర్రోళ్ళు చిత్ర బృందం సందడి చేసింది. ఈ చిత్రం ఆగస్టు 9న ప్రేక్షకుల ముందుకు రానుందని చిత్ర నిర్మాత కొణిదెల నిహారిక తెలిపారు. బందర్ రోడ్డులోని ఓ ప్రముఖ హోటల్‌లో చిత్ర ప్రమోషన్‌లో భాగంగా

కమిటీ కుర్రోళ్ళు చిత్ర యూనిట్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత కొణిదెల నాగబాబు కుమార్తె కొణిదెల నిహారిక మాట్లాడుతూ వంశీ దర్శకత్వంలో కమిటీ కుర్రోళ్లు చిత్రం తెరకెక్కనుందని చెప్పారు. ఈ సినిమాతో 20 మంది కొత్త వాళ్లు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారని సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా ట్రైలర్‌ను రిలీజ్ చేయగా అది ఆకట్టుకుంటోందని పేర్కొన్నారు. కమిటీ కుర్రోళుఅంతా కూడా మూడేళ్లుగా సినిమా కోసం పని చేస్తూనే ఉన్నారన్నారు. అందరూ వారి వారి పాత్రలకు ప్రాణం పోశారన్నారు . ఆగస్ట్ 9న తమ చిత్రం రాబోతోందని. అందరూ చూసి విజయవంతం చేయాలని కోరారు. తమిళంలో తాను హీరోయిన్‌గా నటించిన చిత్రం వచ్చే నెలలో విడుదల కానుందన్నారు. మంచి కథ దొరికితే తెలుగులో హీరోయిన్‌గా నటించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. అనంతరం డైరెక్టర్ యదు వంశీ మాట్లాడుతూ విలేజ్‌లో కొంత మంది కుర్రాళ్లు చిన్నప్పట్నుంచి టీనేజ్, యువకులుగా మారే స్థాయి వరకు వివిధ దశలో వారి మధ్య చోటు చేసుకున్న సంఘటన నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించినట్టు చెప్పారు. గోదావరి జిల్లాల్లోని ఓ ఊర్లో ఉండే 90 శాతం కిడ్స్ చిత్రమే ఇది అని చెప్పారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, లిరికల్ సాంగ్స్‌కు చాలా మంచి స్పందన వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరిని ఈ చిత్రం ఆకట్టుకుంటుందని, తప్పక చిత్రాన్ని వీక్షించి తమను ఆదరించాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో చిత్ర నటీనటులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నంలోని విటిపిఎస్ కూలింగ్ కెనాల్ స్టేజ్ 2 గేట్ వద్ద శుక్రవారం గుర్తు తెలియని పురుషుని మృతదేహం లభ్యమైనట్లు ఇబ్రహీంపట్నం సిఐ ఎం సత్యనారాయణ తెలిపారు. అతని ఆచూకీ తెలిసినవారు ఇబ్రహీంపట్నం పోలీసులకు తెలపాలని కోరారు. సుమారు 5'6 అడుగులు ఎత్తు, సుమారు 55 నుంచి 60 ఏళ్ళ మధ్య వయస్సు ఉండవచ్చని తెలిపారు. నలుపు తెలుపు జుట్టు బట్టతల తెలుపు, ఆకుపచ్చ రంగు బొమ్మల డిజైన్ ఆఫ్ హ్యాండ్ చొక్కా నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. సమాచారం తెలిసిన వారు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో తెలపాలని కోరారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విద్యార్థులు క్రీడాల్లో మరింత రాణించేందుకు కషి చేయాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. ఆ కళాశాల క్రీడా విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రీమియం లీగ్ పోటీలను చిట్టా అమర్‌సుధీర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల క్రీడా విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రోత్సాహిస్తున్నట్లు చెప్పారు. వివిధ రకాల క్రీడల్లో మంచి క్రీడాకారులుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ నెల 12వ తేదీ వరకూ పోటీలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కోశాధికారి కె.రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు. క్రీడావిభాగాధిపతి ఎం విక్టర్‌జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ప్రారంభంలో కాలేజీ యాజమాన్యం

ఐదుగురికి జరిమానా

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలో ఐదుగురు బెల్ట్ షాపు నిర్వాహకులకు లక్ష రూపాయలు భారీ జరిమానా విధించారు. పోలంపల్లి గ్రామంలో బెల్టు షాపులు నిర్వహిస్తున్న ఎనిమిది మంది పాత నేరస్థులపై స్థానిక వత్సవాయి తహశీల్దారు వారి కోర్టులో బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఇటీవల తమ యొక్క సత్ప్రవర్తన బాండ్లను ఉల్లంఘించి గ్రామంలో తిరిగి బెల్ట్ షాపులు నిర్వహిస్తూ వాటి ద్వారా అక్రమ మద్యం అమ్ముతూ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులకు కారణమవుతున్న నలుగురు వ్యక్తులు మన్నే నరసింహారావు, ఎర్రం రామారావు, పెంట్యాల రమణ, ఎర్రం నాగేశ్వరరావులపై ఇటీవల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ జగ్గయ్యపేట వారు కేసులు నమోదు చేశారు. ఐదుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.20వేలు చొప్పున జరిమానా విధించినట్లు జగ్గయ్యపేట స్పెషల్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ మణికంఠ రెడ్డి తెలిపారు.

ఐవిఎఫ్‌పై అవగాహన

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవం 2024ను పురస్కరించుకుని ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ అధ్వర్యంలో వినూత్నంగా ఐవిఎఫ్ ప్రచారాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు సంస్థ ప్రతినిధి ఎం.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో నిర్వహించిన ఈ ప్రచారం ద్వారా ప్రజలలో అవగాహన మెరుగుపరచడం, ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవిఎఫ్) పట్ల అంగీకారాన్ని పెంచడం లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపారు. అదే సమయంలో వంధ్యత్వానికి సంబంధించిన అపోహలను పోగొట్టడం, తమ సంతానోత్పత్తి చికిత్స గురించి తగిన సమాచారంతో నిర్ణయాలు తీసుకునేలా జంటలను ప్రోత్సహించటం చేసినట్లు తెలిపారు. ఈ ప్రచారం కింద, ఆంధ్రప్రదేశ్, వ్యాప్తంగా అంతటా 15 వేర్వేరు ప్రదేశాలలో వీధి నాటకాలు, నుక్కడ్ నాటకాలను ప్రదర్శించినట్లు తెలిపారు.

పశ్చిమ తహశీల్దారుగా ఇంతియాజ్ పాషా

ప్రజాశక్తి - భవానీపురం : విజయవాడ పశ్చిమ తహశీల్ధార్‌గా షేక్ ఇంతియాజ్ పాషా నియమితులయ్యారు. బదిలీల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంతియాజ్ పాషాను పశ్చిమ తహశీల్ధార్‌గా నియమించటంతో ఆయన సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. 2009 సంవత్సరంలో గ్రూఫ్ -2 అధికారిగా ప్రభుత్వ రెవెన్యూ సర్వీసులోకి ఇంతియాజ్ పాషా ప్రవేశించారు. అప్పటినుంచి సమన్వయంతో విధులు నిర్వహిస్తూ, సమర్ధ వంతమైన అధికారిగా గుర్తింపు పొందారు. పాషా, నూజివీడు, ఇబ్రహీంపట్నం, జి.కొండూరు తహశీల్దార్‌గా సేవలు అందించారు. ఎన్టీఆర్ కలెక్టరు కార్యాలయం పరిపాలనాధికారిగా కూడా విధులు నిర్వహించారు.

ప్రతిజ్ఞ రచయిత పేరును దేశ వ్యాప్తంగా ముద్రించాలి

ప్రజాశక్తి - తిరువూరు : నిత్యం పాఠశాలల్లో విద్యార్థులు ఆలపించే భారతదేశం -నా మాతృ భూమి ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును తెలుగు రాష్ట్రాలలోని పాఠ్య పుస్త కాలలో ముద్రించిన విధంగానే దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల పాఠ్య పుస్తకాలలో ముద్రించేందుకు కృషిచే యాలని ప్రతిజ్ఞ ప్రచార కర్త ఎం. రాం ప్రదీప్.. తిరువూరు శాసన సభ్యులు కొలికపూడి శ్రీనివాసరావును కోరారు. ఎమ్మెల్యేను కలిసిన రాంప్రదీప్ ప్రతిజ్ఞ రచయితకు గుర్తింపు తేవాలని కోరారు.